RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 109 బుధవారం, మే 29, 2024 పేజీలు : 4

## పాలస్తీనాకు ఐర్లాండ్ గుర్తింపు

లండన్ : ఇజ్రాయెల్ మాటను తోసిరాజని ఐర్లాండ్ మంగళవారం పాలస్తీనా దేశాన్ని అధికారికంగా గుర్తించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. పాలస్తీనా గుర్తింపు యోచనను ఇజ్రాయెల్ ఇంతకు ముందు ఖండించింది. ఐర్లాండ్ ప్రభుత్వం మంగళవారం ఉదయం క్యాబినెట్ సమావేశంలో పాలస్తీనా గుర్తింపు ప్లాన్‌ను ఆమోదించింది. 'పాలస్తీనాను సార్వభౌమ, స్వతంత్ర దేశంగా ప్రభుత్వం గుర్తిస్తోంది. డబ్లిన్, రామల్లా మధ్య పూర్తి దౌత్య సంబంధాల ఏర్పాటుకు అంగీకరించింది' అని ఆ ప్రకటన తెలిపింది. 'రామల్లాలో ఐర్లాండ్ పూర్తి రాయబార కార్యాలయం ఏర్పాటుతో పాటు పాలస్తీనాకు ఐర్లాండ్ రాయబారి నియామకం జరుగుతుంది' అని ప్రభుత్వం తెలియజేసింది. శాంతి పరిరక్షణ ఆశతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐర్లాండ్ ప్రధాని సైమన్ హారిస్ వెల్లడించారు. 'ప్రపంచం మాట వినాలని, గాజాలో మానవతావాద సంక్షోభాన్ని ఆపాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నాను' అని హారిస్ ఒక ప్రకటనలో తెలిపారు.

## దేశ ప్రజలు బీజేపీని గద్దె దించాలని

# నిర్ణయించుకున్నారు

### : సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ: దేశ ప్రజలు బీజేపీని గద్దె దించాలని నిర్ణయించుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ మాటలు వినేందుకు దేశ ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రధాని మోడీకి పాకిస్తాన్ గుర్తు వస్తుందని సీఎం రేవంత్ మండిపడ్డారు. "పాకిస్తాన్ ప్రధాని పుట్టినరోజు వేడుకలకు ఎవరూ వెళ్లరు. మోడీ ఇష్టం మేరకు వెళ్లి పాక్ ప్రధానిని కౌగిలించుకున్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఎస్సీ ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయడం, రాజ్యాంగాన్ని మార్చడం అంశాలను లేవనెత్తితే బీజేపీకి పాకిస్తాన్ గుర్తు వస్తుంది. పదేళ్ల దేశ పురోగతి ప్రోగ్రెస్ కార్డు బీజేపీ విడుదల చేయాలి. పదేళ్ల పాలనా వైఫల్యాలను కప్పించుకునేందుకు గాంధీ కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారు. దేశ ప్రధానిని, ప్రధాని కుర్చీని కాంగ్రెస్ ఎప్పుడూ అగౌరవ పరచలేదు. డిపాజిట్లు కూడా రాని చోట మెజారిటీ సీట్లు వస్తాయని బీజేపీ బీరాలు పలుకుతోంది. మోడీ గ్యారెంటీ వారంటీ ఖతమైంది" అని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు రాష్ట్ర ప్రజల తరపున సోనియా గాంధీని ఆహ్వానించామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# సోనియాతో రేవంత్ భేటి

## రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు వస్తానని హామీ



న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతోన్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న దశాబ్ది ఉత్సవాలకు రావాలని సోనియాగాంధీని ఆయన కోరారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ప్రత్యేకంగా సోనియా గాంధీతో భేటీ అయ్యారు. సోనియాతో భేటీ ముగిసిన అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఆమెను చీఫ్ గెస్ట్ గా పిలవాలని ఇప్పటికే తెలంగాణ కేబినెట్ తీర్మానించిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడంపై సోనియా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసిన ఉద్యమకారులను, అమరుల కుటుంబాలను ఈ వేడుకలకు ఆహ్వానిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

## కేజ్రీ పిటిషన్ తక్షణ విచారణకు...

# సుప్రీం నో



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ బెయిల్ పొడిగింపు అభ్యర్థనను తక్షణం విచారించేందుకు సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్ మంగళవారం నిరాకరించింది. విచారణ నిమిత్తం పిటిషన్ లిస్టింగ్‌పై తదుపరి ఆదేశాల నిమిత్తం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు ఈ పిటిషన్‌ను బెంచ్ నివేదించింది. జూన్ 1న ముగియనున్న తన మధ్యంతర బెయిల్ గడువును వైద్య కారణాలపై ఏడు రోజులు పొడిగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్ కేజ్రీవాల్ కోరారు. లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మార్చి 21న అరెస్టు చేసిన కేజ్రీవాల్‌ను మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని సుప్రీం కోర్టు ఈ నెల 10న ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారానికి వీలుగా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలన్న కేజ్రీ విజ్ఞప్తికి సుప్రీం కోర్టు అంగీకరించింది. కొన్ని వైద్య పరీక్షల కోసం సిఎం కేజ్రీవాల్‌కు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ గడువును పొడిగించాలని ఆయన తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి చేసిన వినతిని వెంటనే పరిశీలించేందుకు న్యాయమూర్తులు జెకె మహేశ్వరి, కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం నిరాకరించింది.


### ఏపీ సీఎం జగన్‌పై గులకరాయి దాడి కేసులో

## నిందితుడికి బెయిల్



అమరావతి : ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పై గులకరాయి దాడి కేసులో నిందితుడు సతీష్‌కు బెయిల్ మంజూరయ్యింది. ఈ సందర్భంగా విజయవాడ కోర్టు సతీష్‌కు కండిషనల్ బెయిల్ మంజూరు చేసింది. శని, ఆదివారాలు పీఎస్‌లో సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. రూ. 50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం జగన్ విజయవాడలో బస్సుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సుపై నిలబడి మాట్లాడుతుండగా సీఎంపై గులకరాయితో దాడి చేశారు. ఈ దాడిలో జగన్‌కు నుదుటిపై గాయమై రక్తస్రావమైంది. పక్కనే ఉన్న మరో మంత్రికి సైతం గాయాలయ్యాయి. ఈ కేసును నమోదు చేసుకున్న పోలీసులు సతీష్ అనే నిందితుడిని అరెస్టు చేసి నెల్లూరు జైల్లో ఉంచారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని నిందితుడు పలుమార్లు పిటిషన్ దాఖలు చేసుకోగా విచారణ జరిపిన న్యాయస్థానం తాజాగా బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## సంక్షేమ పథకాలు, విధానాలు పేదలకు అందడంలేదు: చిదంబరం



కొజికోడ్(కేరళ): దేశంలోని వివిధ సంక్షేమ పథకాలు, విధానాలు పేదలకు అందడం లేదని(నాట్ పైవోటెడ్) సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం అన్నారు. పథకాలు, విధానాలు పేదలకు అందితేనే సమ సమాజం ఏర్పడుతుందని చిదంబరం అన్నారు. ఎంపి వీరేంద్ర కుమార్ స్మారక కార్యక్రమంలో 'ఇన్ క్లూజివ్ గ్రోత్: మిత్ అండ్ రియాలిటీ' అనే అంశంపై చిదంబరం ప్రసంగిస్తూ ఈ విషయాలు తెలిపారు. "ఒకదానికొకటి ప్రతిబింబించే ఆర్థిక, సామాజిక సోపానక్రమాలను మనం అర్థం చేసుకోకపోతే, మన పాలసీలు దిగువ వర్గానికి అందకపోతే, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారినవర్గానికి అందకపోతే మనది సమసమాజం అనిపించుకోదు" అన్నారు. సమ సమాజాన్ని నిర్మించడం ద్వారానే సమ్మిళిత వృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేత చిదంబరం ఉద్ఘాటించారు.

## కన్యాకుమారిలో ప్రధాని మోడీ

# ధ్యానం



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం దేశం అంతటా పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్యాత్మిక యాత్ర కోసం తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలోని ప్రసిద్ధ వివేకానంద రాక్ మెమోరియల్ వద్దకు ఈ నెల 30న చేరుకుంటారు. స్వామి వివేకానంద ధ్యానం చేసిన ప్రదేశంలోనే 73 ఏళ్ల ప్రధాని మోడీ తన బస సమయంలో 24 గంటల పాటు ధ్యానం చేస్తారు. రమణీయమైన వివేకానంద రాక్ మెమోరియల్ దేశం దక్షిణ కొనన కన్యాకుమారి తీరం వద్ద సముద్ర మధ్యలో తమిళ రుషి తిరువళ్లువర్ ఏకశిలా విగ్రహం సమీపంలో ఉంది. మూడవ దఫా విజయమే లక్ష్యంగా ఉన్న ప్రధాని మోడీ గురువారం (30) సాయంత్రం కన్యాకుమారికి వచ్చి, జూన్ 1న ఢిల్లీకి తిరిగి బయలుదేరుతారు. ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ జూన్ 1న ముగియనున్నది. వోట్ల లెక్కింపు 4న జరుగుతుంది. 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందు ప్రధాని మోడీ కాషాయ దుస్తులతో కేదార్‌నాథ్ సమీపంలోని పవిత్ర గుహలో ధ్యానం చేశారు. ఆనాటి ఆయన ఫోటో బయటకు వచ్చింది కూడా. ఇది ఇలా ఉండగా, ప్రధాని మోడీ ఈ నెలలో ఎన్‌డిటివికి ఇంటర్వ్యూ ఇస్తూ, 'ప్రభంజనం మాకు అనుకూలంగానే ఉన్నది. దాని గురించి నేను చెప్పవలసింది ఏమీ లేదు. మాదే పైచేయి. ప్రతి ఒక్కరికీ అది తెలుసు' అని అన్నారు.

### రాష్ట్ర అధికారిక చిహ్నంలో...

## కాకతీయ తోరణం ఉండదు

### : సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ : రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం ఉండదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమ్మక్క – సారక్క, నాగోబా జాతర స్ఫూర్తికి అద్దం పట్టేలా చిహ్నం ఉంటుందన్నారు. పోరాటాలు, త్యాగాలకు ప్రతిబిం బంగా అధికారిక చిహ్నం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ గేయానికి సంగీతం సమకూర్చడం సహా మొత్తం వ్యవహారాన్ని అందెశ్రీకే అప్పగించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు. అందెశ్రీనే కీరవాణిని ఎంపిక చేశారు.

కీరవాణి వ్యవహారంతో నాకు సంబంధం లేదు. ఎవరితో సంగీతం చేయించువాలనేది అందెశ్రీ నిర్ణయానికే వదిలేశాను అని పేర్కొన్నారు.

# దళితుల హక్కులను లూటీ చేసిన ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు తనపై చేస్తున్న వివిధ రాఓపణలను చెత్తగా అభివర్ణించిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో 400కి పైగా సీట్లను ఎన్‌డిఎ కూటమి గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ జూన్ 1న జరిగే చివరి దశ ఎన్నికల తర్వాత కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలకు ఈ చివరి దశ ఎన్నికలతో కథ సమాప్తమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికలలో రిజర్వేషన్లను తెరపైకి తీసుకువచ్చిన ప్రతిపక్షాలపై ఆయన మండిపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి వర్గాలు ప్రతిపక్షాలను కొన్ని పార్టీలు దశాబ్దాలుగా లూటీ చేశాయని ఆరోపించారు. రాత్రికిరాత్రే విద్యా సంస్థలను మైనారిటీ సంస్థలుగా ప్రతిపక్షాలు మార్చాయని ఆయన ఆరోపించారు. వెనుకబడిన తరగతులకు తాము సానుభూతిపరులమని చెప్పుకునే ప్రతిపక్షాలు నిజానికి దళితులు, గిరిజనులకు బద్ధ శత్రువులని ఆయన ఆరోపించారు. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీని ఉదహరిస్తూ ఆ యూనివర్సిటీకి మైనారిటీ హోదా ఇచ్చి అక్కడ రిజర్వేషన్లను అంతం చేశాయని ఆయన చెప్పారు. అదే విధంగా దేశవ్యాప్తంగా దాదాపు 10,000 యూనివర్సిటీలు ఉన్నాయని, అక్కడ ఎస్‌సి, ఎస్‌టిల నుంచి రిజర్వేషన్ల హక్కును లాక్కున్నాయని ఆయన చెప్పారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజ్యాంగ స్ఫూర్తిని అతిక్రమించారని ఆయన విమర్శించారు. కాంగ్రెస మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్రలు స్పష్టంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. మైనారిటీ కోటా ఇవ్వడం ద్వారా తన ఓటు బ్యాంకును సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ తరాలను నాశనం చేస్తోందని ఆయన ఆరోపించారు.

దళితులు, ఎస్‌సిలు, ఓబిసి సోదర సోదరీమణుల కోసం పోరాడవలసిన బాధ్యత తనపైన ఉందని ఆయన స్పష్ చేశారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను నిలిపివేస్తుందా అన్న ప్రశ్నకు కాంగ్రెస్ ఇప్పటికే ఆ పాపాన్ని మూటగట్టుకుందని, అందుకే అసత్యాలు ప్రచారం చేస్తున్నదని ఆయన విమర్శించారు.

## సంపాదకీయం

# 'రుతుస్రావ సెలవులు' మహిళల హక్కు...!

దేశ కార్మిక చట్టాలు అనేక రకాలైన సెలవులకు సంబంధించిన నిబంధనలు కలిగి ఉన్నప్పటికీ నేటికీ మహిళలకు అత్యవసరమైన 'రుతు స్రావ సెలవుల(మెనుస్ట్రువల్ లీవ్)' చట్టాలను చేయడంలో తటపటాయిస్తున్నట్లు విధితమవుతున్నది. లింగ అసమానతల సమాజంలో సహజ శారీరక సమస్య అయిన "బహిష్టులు లేదా పీరియడ్స్ లేదా రుతుస్రావాలను (మెనుస్ట్రువల్ సైకిల్)" మహిళలకు మాత్రమే కేటాయించడంతో పురుష సమాజానికి ఆ సమయంలో మహిళలు పడే మహా వేదనలు అర్థం కావడం లేదు. సాధారణంగా పీరియడ్స్ సమయంలో 3 నుంచి 5 రోజుల పాటు అధిక రక్తస్రావంతో పాటు తీవ్ర కడుపు నొప్పిని అనుభవిస్తూ ఉంటారు. పీరియడ్స్ వచ్చాయని మహిళలు బహిరంగంగా చెప్పడానికి ఇష్టపడరు, చెప్పినా సమాజం దానిని చులకన భావంతో చూస్తుందని కూడా మహిళా సమాజం భయపడడం జరుగుతోంది. సాధారణంగా రుతుస్రావ నొప్పిని కడుపు నొప్పిగా కప్పిపుచ్చడానికి లేదా మరో ఇతర అనారోగ్యమని చెప్పడానికి మహిళలు ఇష్టపడతారు. ఆధునిక స్త్రీ పురుష సమాజం రుతు ఆరోగ్యం పట్ల బహిరంగంగా చర్చించడానికి, వారి బాధలను అర్థం చేసుకోవడానికి ముందుకు రావాలి. బహిష్టు సమయ బాధలను మన ఇంట్లోనా మహిళలు కూడా అనుభవిస్తున్నప్పటికీ కార్యాలయాల్లో పని చేసే మహిళలు పడుతున్న బాధలను మాత్రం చులకనగా చేసి చూడడం, అమానవీయంగా ఎగతాళిగా ప్రవర్తించడం మానుకొని బహిష్టు కాలపు సెలవుల అవసరం గూర్చి చర్చించడం సత్వర అవసరంగా భావించాలి. రుతుక్రమ సెలవుల విధానాలను కొన్ని దేశాలు అమలు చేస్తున్నప్పటికీ భారత మహిళలకు ఈ సదుపాయం కల్పించడంలో పాలకుల దృష్టి పడడం లేదు. బహిష్టు సమయంలో విధులు నిర్వహించని మహిళలకు జీతంతో కూడిన లేదా జీతం చెల్లించని సెలవులుగా కొద్ది దేశాలు తమ చట్టాలను చేసి ముందుకు సాగుతున్నాయని, ఇలాంటి దేశాల నియమనిబంధనలను చూసి భారత ప్రభుత్వం కూడా అదే విధమైన చట్టాలను చేయాలని మహిళాలోకం కోరుకుంటున్నది. ప్రసూతి సెలవుల వలె రుతుస్రావ సమయ సెలవుల వెసులుబాటును కలిపించడం ద్వారా లింగ సమానత్వ సాధనకు మరో నవ్య అడుగుగా భావించాలి. రుతుస్రావ సమయంలో మహిళలకు 'డిస్మెనోరియా' అనబడే తీవ్ర నొప్పి కలుగుతుంది. అధిక శాతం మహిళలు పీరియడ్స్ సమయంలో ఏకాగ్రతను హరింపజేస్తూ, సాధారణ పని తీరుకు అంతరాయాలు కలిగిస్తూ, కొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పీరియడ్స్ సమయంలో మహిళలు భావోద్వేగ, ప్రవర్తనపరమైన సమస్యలను (ఎమోషనల్ అండ్ బిహేవియరల్ సిండ్రోమ్) ఎదుర్కొంటున్నారు. రుతుస్రావ సమయాల్లో అధిక శాతం మహిళలు ఆందోళన, ఉద్రిక్తత, అణగారిన మానసిక స్థితులు, మూడ్ స్వింగ్, ఏకాగ్రత లోపం, సామాజిక ఉపసంహరణ, నిద్ర లేమి, కడుపు నొప్పి లాంటి అనారోగ్యాలను అనాదిగా అనుభవిస్తున్నారు. రుతుస్రావ సమయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించడానికి, సామాన్య మహిళలకు/బాలికలకు అవగాహన కల్పించడానికి 2014 నుంచి ప్రతి ఏట 28 మే రోజున ప్రపంచ దేశాలు "రుతుస్రావ ఆరోగ్య దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. రుతుస్రావ ఆరోగ్య దినం-2024 నినాదంగా "రుతుస్రావ హిత ప్రపంచ నిర్మాణంలో ఏకమవుదాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. 2003లో ఐరాస ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ సభ్య దేశాలకు సందేశమిస్తూ బహిష్టు సెలవులు మహిళల హక్కుగా భావించాలని సూచించింది. 2014 నుంచి ప్రతి ఏట 28 మే రోజున "ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత దినం" పాటించాలని డబ్ల్యూహెచ్ఓ అంగీకరించింది. 1912లోనే కేరళ రాష్ట్రంలోనే ఒక పాఠశాల విద్యార్థినులకు బహిష్టు సెలవులు మంజూరు చేయడం జరిగిందని గమనించాలి. రష్యాలో కూడా 1927కు పూర్వం రుతు స్రావ సెలవులను వర్తింపజేసినప్పటికీ 1927 తర్వాత తొలగించారు. జపాన్‌లో 1947లోనే స్త్రీలకు రుతుస్రావ సమయంలో పని రోజులుగా సెలవులను అనుమతించారు. పీరియడ్స్ కాలపు బాధలను నడవైద్యపరమైన సమస్యగా లేదా వివక్షాపూరిత చర్యగా చర్చలు కొనసాగుతున్నాయి. 2003 నుంచి ఇండోనేషియా నెలకు రెండు రోజుల బహిష్టు సెలవుల హక్కును కల్పించింది. దక్షిణ కొరియాలో రుతుక్రమ సెలవులకు అర్హత కల్పిస్తూ రుతుక్రమ సెలవులు తీసుకోనపుడు అదనపు వేతనం కూడా తెల్లిస్తున్నారు. తైవాన్, స్పెయిన్, ఇటలీ, జాంబియా లాంటి దేశాలు 1 నుంచి 3 రోజుల రుతుస్రావ సెలవులను అనుమతిస్తున్నాయి. బహిష్టు అనేది ఒక కళంక క్రియగా, మహిళలు ఆ సమయంలో అందరికీ దూరంగా, ఓ మూలన కూర్చోవాలనే అనారోగ్యకర సాంప్రదాయం, మూఢ నమ్మకాలు, సామాజిక కట్టుబాట్లు, మహిళల రుతుస్రావ వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన లేమి, బహిషుల సమస్యల పట్ల చిన్న చూపు నేటికీ కొనసాగడం అత్యంత విచారకరం. సువిశాల భారతంలో 35.5 కోట్ల మహిళలు రుతుస్రావ వయస్సులో ఉన్నారని, వీరిలో 75 శాతం మహిళలు నేటికీ అపరిశుభ్ర గుడ్డలను పీరియడ్స్ సమయంలో ఉపయోగిస్తున్నారని తెలుస్తున్నది.

# ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లపై పక్కా ప్రణాళిక







**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. మంగళవారం నాడు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ.. జూన్ 4న నిర్వహించు పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూసుకోవాలని, గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ హాల్ లో నిర్దేశిత రౌండ్ల వారీగా కౌంటింగ్ ను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత సంబంధిత టేబుల్ ల కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అనంతరం ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అదే విధంగా కౌంటింగ్ కేంద్రం వద్ద హై స్పీడ్ తో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించి, కౌంటింగ్ నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు ధృవీకరణ పత్రం సమర్పించాలని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం ఈవీఎం యంత్రాలను గోడౌన్ కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ హరిప్రియ, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** దేవరయంజాల్ విద్యుత్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతుందని శామీర్ పేట విద్యుత్ ఏఈ రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శామీర్ పేట సెక్షన్ పరిధిలోని దేవరయంజల్ విద్యుత్ సబ్‌స్టేషన్లో పోతాయిపల్లి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోతాయపల్లి, దేవరయంజాల్ గ్రామాల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మందాయి పల్లి ఫీడర్ పరిధిలో మరమ్మత్తులు చేపడుతున్నందున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మందాయి పల్లి గ్రామానికి, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ రమేష్ కోరారు.

**అలియాబాద్ సెక్షన్ పరిధిలో...**

శామీర్ పేట మండలం అలియాబాద్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ విద్యుత్ ఏ ఈ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేశవరం సబ్ స్టేషన్ లో కేశవరం ఫీడర్, డైరీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నాగిశెట్టిపల్లి గ్రామానికి, వ్యవసాయ క్షేత్రాలకు, కేశవరం వ్యవసాయ క్షేత్రాలకు, హెచ్టి సర్వీస్ జెర్సీ డైరీ, స్నేహ ఫామ్స్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





**శామీర్ పేట, (గరుడ వార్త) :** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా శామీర్ పేటకు చెందిన గుర్రపు రమేష్ , కుమారుడు గుర్రం సాయితేజ్ వారి కుటుంబ సభ్యులు 50 కేజీల బియ్యం అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ అంటే కలెక్టివ్ రెస్పాన్సిబిలిటీ కాని పర్సనల్ రెస్పాన్సిబిలిటీగా, పర్సనల్ ఎజెండాగా నడుస్తోంది

- కామ్ కే వాస్తే కాదు.. నామ్ కే వాస్తే ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలవి హైడ్ అండ్ సీక్ గేమ్
- కప్పం తరలించేదుకే రేవంత్ ఢిల్లీ పర్యటనలు
- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్




**హైదరాబాద్ :మే** రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ అంటే కలెక్టివ్ రెస్పాన్సిబిలిటీగా వ్యవహరించాలి. కాని పర్సనల్ రెస్పాన్సిబిలిటీగా, పర్సనల్ ఎజెండాగా నడుస్తోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ కొత్త నిర్వచనమిచ్చారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి, మొన్నటివరకు జరిగిన కేబినెట్ సమావేశం వరకు తీరుతెన్నులు పరిశీలిస్తే ఎవరికి వారే యమునా తీరే అనే మాదిరిగా ఉందని దుయ్యబట్టారు. ఒక్కొక్క మంత్రి వద్ద రెండు నుంచి నాలుగు వరకు కీలక శాఖలు ఉన్నాయని.. ప్రతిరోజు ప్రతి శాఖకు సంబంధించిన ఒక్కొక్క అంశంలో లొసుగులు వెలుగులోకి వస్తున్నాయన్నారు.. రాష్ట్ర మంత్రులు శాఖాపరమైన సమీక్షలే నిర్వహించడం లేదంటూ ఆరోపించారు. పరిశ్రమలు, ఐటీ శాఖకు సంబంధించిన విషయంలో చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమలకు వేలకోట్ల రూపాయల సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా దాటవేస్తోందని ప్రభాకర్ మండిపడ్డారు. ఐటీ శాఖకు సంబంధించి కొత్త పరిశ్రమలు దేవుడెరుగు.. ఉన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్రం ఇచ్చే సబ్సిడీలతో పాటు రాష్ట్రం ప్రకటించే సబ్సిడీలు అమలు జరగడం లేదని ఫైరయ్యారు. గత నాలుగు రోజులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధ్యతలు నిర్వహించే సివిల్ సప్లై మంత్రిత్వ శాఖకు సంబంధించి.. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు, సరఫరాలు, నిల్వలు, చర్యల్లో కుంభకోణాలు బయటకు వచ్చాయని నిప్పులు చెరిగారు. మరోవైపు ఇరిగేషన్ శాఖలోనూ కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో పాటు మేడిగడ్డ పరిస్థితి దయనీయంగా మారిందని.. నీటి సరఫరాలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. అటు, విద్యుత్ శాఖకు సంబంధించి అనేక విషయాలను లేవనెత్తారు. వ్యవసాయం, పరిశ్రమలు, వినియోదారులకు అసలు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలేదని నిలదీశారు.కామ్ కే వాస్తె కాదు.. నామ్ కే వాస్తె ముఖ్యమంత్రి:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి గురించి ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మండిపడ్డారు. అసలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నామ్ కే వాస్తె ముఖ్యమంత్రి అని.. కామ్ కే వాస్తె ముఖ్యమంత్రిగా దరిదాపుల్లో కానరావడం లేదని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై, ప్రభుత్వ శాఖల్లో కరప్షన్ పై ముఖ్యమంత్రి నోరువిప్పడం లేదని, మరోవైపు సీఎం నిర్వహించే సమీక్షలకు సంబంధిత శాఖల మంత్రులే హాజరుకాలేని పరిస్థితి ఎదురైందని దుయ్యబట్టారు. ఎవరికివారే యమునాతీరే అన్నట్లుగా కేబినెట్ మీటింగులు జరుగుతున్నాయంటూ విమర్శించారు. అంతేకాదు.. నామ్ కే వాస్తె ఉన్న ముఖ్యమంత్రికి కాకుండా.. కేవలం అధిష్టానానికి మాత్రమే తాము జిమ్మేదారిగా మంత్రులు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రుల తీరు, వారి వ్యవహార శైలితో రాష్ట్రానికి, ప్రజానీకానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# అలియాబాద్ గ్రామంలో విత్తన కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన



**శామీర్ పేట, (గరుడ వార్త) :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో రైతులకు విత్తనాలు కొనుగోలుపై అవగాహన కల్పించారు. మంగళవారం శామీర్ పేట మండలం అలియాబాద్, బాబా గూడ గ్రామాల్లో రైతులకు ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయాలో వ్యవసాయ అధికారి రమేష్ జాగ్రత్తలు వివరించారు. అలాగే మూడు చింతలపల్లి మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి మండల కేంద్రం మూడు చింతలపల్లి, లక్ష్మాపూర్, లింగాపూర్ లలో రైతులకు విత్తనాల కొనుగోలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్స్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. లూజుగా ఉన్న సంచుల్లోంచి విత్తనాలు కొనకూడదని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను, విత్తనాల ప్యాకెట్ ను పంటకాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్తపరచాలని తెలిపారు. గడువు మీరిన విత్తనాలు కొనకూడదని చెప్పారు. విత్తనాలు కొనే ముందు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రవి, సహకార సంఘం డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు విస్తృత కార్యాచరణ



ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈసీ అనుమతి ఇవ్వడంతో సీఎం రేవంత్ రెడ్డి అనుకున్న ప్లాన్ను పక్కాగా వర్కవుట్ చేస్తున్నారు. జూన్ 2తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతుందని, రాష్ట్ర అధికార గీతంగా జయ జయహే తెలంగాణకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ గీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఆలపించనున్నారు. ఈ గేయం ఉద్యమం సమయంలో విస్తృత ప్రాచుర్యం పొందింది. అందరిలోనూ స్ఫూర్తిని నింపింది. ప్రస్తుతం ఈ గేయం నిడివి సుమారు రెండు నిమిషాలకు కుదించడంతో పాటు కొన్ని మార్పులు చేస్తున్నట్లు సమాచారం. అలాగే సవరించిన అధికార చిహ్నం, తెలంగాణ తల్లి రూపాన్ని కూడా ఆవిష్కరించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయంపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జూన్ 2న ఆవిష్కరించాలనే భావన ప్రభుత్వంలో ఉంది. రాష్ట్ర అవతరణ వేడుకలకు ముఖ్య అతిథిగా సోనియా గాంధీని ఆహ్వానించి సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యమకారులను సన్మానించనున్నారు. సన్మానం చేయాల్సిన ఉద్యమకారుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆరు గ్యారంటీల్లో మరొకటి లేదా మరేదైనా కొత్త పథకం లేదా పాలసీని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రకటించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే టీఎస్ పేరును టీజీగా ప్రభుత్వం మార్చింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన బోర్డులు, వెబ్సైట్లన్నీ పూర్తిగా మారుస్తోంది. జిల్లా, మండలం, పంచాయతీల్లోనూ అవతరణ వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోము: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఈ నెల ప్రారంభంలో బిజెపి తృణమూల్ కాంగ్రెస్‌ను అవినీతిపరులుగా, హిందువులకు వ్యతిరేకమైనదిగా చిత్రీకరిస్తూ కనీసం 4 దినపత్రికలలో ప్రకటనలు ప్రచురించింది. లోక్ సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఎలాంటి ప్రకటనలను ప్రచురించకూడదని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన కలకత్తా హైకోర్టు ఆదేశాలపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి న్యాయమూర్తులు జెకె. మహేశ్వరి, కెవి. విశ్వనాథన్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ నిరాకరించింది. "ప్రాథమిక సాక్ష్యాధారాల (ప్రైమా ఫేసీ) దృష్ట్యా ప్రకటన అవమానకరమైనది" అని బెంచ్ పేర్కొంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రాజకీయ పార్టీలు, నాయకులు.

## సంతానోత్పత్తిపై ప్రభావం చూపే మైక్రోప్లాస్టిక్

### - ఒక గ్రామ్ కణజాలంలో 329.44 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్ పురుష సంతానోత్పత్తిపై ప్రభావం లి న్యూ మెక్సికో వర్సిటీ అధ్యయనం



**హైదరాబాద్, మే** మైక్రోప్లాస్టిక్ కారణంగా పురుష సంతానోత్పత్తిపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని పరిశోధకుడు జియోజంగ్ యూ పేర్కొన్నారు. పురుషుడి సంతానోత్పత్తికి కీలకమైన వృషణాల్లోనూ మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు యూనివర్సిటీ ఆఫ్ న్యూ మెక్సికో పరిశోధకులు తెలిపారు. మగ కుక్కలు, పురుషులపై ఈ అధ్యయనం చేసినట్టు పేర్కొన్నారు. కుక్కలతో పోలిస్తే పురుషుల వృషణాల్లో మూడు రెట్లు ఎక్కువగా మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు గుర్తించామన్నారు. వృషణాల్లో 12 రకాల మైక్రోప్లాస్టిక్ రేణువులను కనుగొన్నామని.. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, బ్యాగ్స్ తయారీకి వాడే పాలీఇథైలీన్ (పీఈ), పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) కూడా ఇందులో ఉన్నట్టు వెల్లడించారు. ఒక్క వృషణాల్లోనే కాదు మనుషుల రక్తం, గుండె, ఆఖరికి గర్భిణుల మావిలో (పిండం) కూడా మైక్రోప్లాస్టిక్ అవశేషాలను కనుగొన్నట్టు పరిశోధకులు వెల్లడించారు. 62 మంది గర్భిణుల మావి నమూనాలను పరీక్షిస్తే.. ప్రతీ గ్రాము కణజాలంలో 6.5 నుంచి 790 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు వివరించారు. పురుషులలో 329.44 మైక్రోగ్రాములుకుక్కలలో 122.63 మైక్రోగ్రాములు ఉన్నట్లు గుర్తించారు.

# 'రుతుస్రావ సెలవులు' మహిళల హక్కు...




దేశ కార్మిక చట్టాలు అనేక రకాలైన సెలవులకు సంబంధించిన నిబంధనలు కలిగి ఉన్నప్పటికీ నేటికీ మహిళలకు అత్యవసరమైన 'రుతు స్రావ సెలవుల(మెనుస్ట్రువల్ లీవ్)' చట్టాలను చేయడంలో తటపటాయిస్తున్నట్లు విధితమవుతున్నది. లింగ అసమానతల సమాజంలో సహజ శారీరక సమస్య అయిన "బహిష్టులు లేదా పీరియడ్స్ లేదా రుతుస్రావాలను (మెనుస్ట్రువల్ సైకిల్)" మహిళలకు మాత్రమే కేటాయించడంతో పురుష సమాజానికి ఆ సమయంలో మహిళలు పడే మహా వేదనలు అర్థం కావడం లేదు. సాధారణంగా పీరియడ్స్ సమయంలో 3 నుంచి 5 రోజుల పాటు అధిక రక్తస్రావంతో పాటు తీవ్ర కడుపు నొప్పిని అనుభవిస్తూ ఉంటారు. పీరియడ్స్ వచ్చాయని మహిళలు బహిరంగంగా చెప్పడానికి ఇష్టపడరు, చెప్పినా సమాజం దానిని చులకన భావంతో చూస్తుందని కూడా మహిళా సమాజం భయపడడం జరుగుతోంది. సాధారణంగా రుతుస్రావ నొప్పిని కడుపు నొప్పిగా కప్పిపుచ్చడానికి లేదా మరో ఇతర అనారోగ్యమని చెప్పడానికి మహిళలు ఇష్టపడతారు. ఆధునిక స్త్రీ పురుష సమాజం రుతు ఆరోగ్యం పట్ల బహిరంగంగా చర్చించడానికి, వారి బాధలను అర్థం చేసుకోవడానికి ముందుకు రావాలి. బహిష్టు సమయ బాధలను మన ఇంట్లోనా మహిళలు కూడా అనుభవిస్తున్నప్పటికీ కార్యాలయాల్లో పని చేసే మహిళలు పడుతున్న బాధలను మాత్రం చులకనగా చేసి చూడడం, అమానవీయంగా ఎగతాళిగా ప్రవర్తించడం మానుకొని బహిష్టు కాలపు సెలవుల అవసరం గూర్చి చర్చించడం సత్వర అవసరంగా భావించాలి. రుతుక్రమ సెలవుల విధానాలను కొన్ని దేశాలు అమలు చేస్తున్నప్పటికీ భారత మహిళలకు ఈ సదుపాయం కల్పించడంలో పాలకుల దృష్టి పడడం లేదు. బహిష్టు సమయంలో విధులు నిర్వహించని మహిళలకు జీతంతో కూడిన లేదా జీతం చెల్లించని సెలవులుగా కొద్ది దేశాలు తమ చట్టాలను చేసి ముందుకు సాగుతున్నాయని, ఇలాంటి దేశాల నియమనిబంధనలను చూసి భారత ప్రభుత్వం కూడా అదే విధమైన చట్టాలను చేయాలని మహిళాలోకం కోరుకుంటున్నది. ప్రసూతి సెలవుల వలె రుతుస్రావ సమయ సెలవుల వెసులుబాటును కలిపించడం ద్వారా లింగ సమానత్వ సాధనకు మరో నవ్య అడుగుగా భావించాలి. రుతుస్రావ సమయంలో మహిళలకు 'డిస్మెనోరియా' అనబడే తీవ్ర నొప్పి కలుగుతుంది. అధిక శాతం మహిళలు పీరియడ్స్ సమయంలో ఏకాగ్రతను హరింపజేస్తూ, సాధారణ పని తీరుకు అంతరాయాలు కలిగిస్తూ, కొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పీరియడ్స్ సమయంలో మహిళలు భావోద్వేగ, ప్రవర్తనపరమైన సమస్యలను (ఎమోషనల్ అండ్ బిహేవియరల్ సిండ్రోమ్) ఎదుర్కొంటున్నారు. రుతుస్రావ సమయాల్లో అధిక శాతం మహిళలు ఆందోళన, ఉద్రిక్తత, అణగారిన మానసిక స్థితులు, మూడ్ స్వింగ్, ఏకాగ్రత లోపం, సామాజిక ఉపసంహరణ, నిద్ర లేమి, కడుపు నొప్పి లాంటి అనారోగ్యాలను అనాదిగా అనుభవిస్తున్నారు. రుతుస్రావ సమయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించడానికి, సామాన్య మహిళలకు/బాలికలకు అవగాహన కల్పించడానికి 2014 నుంచి ప్రతి ఏట 28 మే రోజున ప్రపంచ దేశాలు "రుతుస్రావ ఆరోగ్య దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. రుతుస్రావ ఆరోగ్య దినం-2024 నినాదంగా "రుతుస్రావ హిత ప్రపంచ నిర్మాణంలో ఏకమవుదాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. 2003లో ఐరాస ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ సభ్య దేశాలకు సందేశమిస్తూ బహిష్టు సెలవులు మహిళల హక్కుగా భావించాలని సూచించింది. 2014 నుంచి ప్రతి ఏట 28 మే రోజున "ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత దినం" పాటించాలని డబ్ల్యూహెచ్ఓ అంగీకరించింది. 1912లోనే కేరళ రాష్ట్రంలోనే ఒక పాఠశాల విద్యార్థినులకు బహిష్టు సెలవులు మంజూరు చేయడం జరిగిందని గమనించాలి. రష్యాలో కూడా 1927కు పూర్వం రుతు స్రావ సెలవులను వర్తింపజేసినప్పటికీ 1927 తర్వాత తొలగించారు. జపాన్‌లో 1947లోనే స్త్రీలకు రుతుస్రావ సమయంలో పని రోజులుగా సెలవులను అనుమతించారు. పీరియడ్స్ కాలపు బాధలను నడవైద్యపరమైన సమస్యగా లేదా వివక్షాపూరిత చర్యగా చర్చలు కొనసాగుతున్నాయి. 2003 నుంచి ఇండోనేషియా నెలకు రెండు రోజుల బహిష్టు సెలవుల హక్కును కల్పించింది. దక్షిణ కొరియాలో రుతుక్రమ సెలవులకు అర్హత కల్పిస్తూ రుతుక్రమ సెలవులు తీసుకోనపుడు అదనపు వేతనం కూడా తెల్లిస్తున్నారు. తైవాన్, స్పెయిన్, ఇటలీ, జాంబియా లాంటి దేశాలు 1 నుంచి 3 రోజుల రుతుస్రావ సెలవులను అనుమతిస్తున్నాయి. బహిష్టు అనేది ఒక కళంక క్రియగా, మహిళలు ఆ సమయంలో అందరికీ దూరంగా, ఓ మూలన కూర్చోవాలనే అనారోగ్యకర సాంప్రదాయం, మూఢ నమ్మకాలు, సామాజిక కట్టుబాట్లు, మహిళల రుతుస్రావ వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన లేమి, బహిషుల సమస్యల పట్ల చిన్న చూపు నేటికీ కొనసాగడం అత్యంత విచారకరం. సువిశాల భారతంలో 35.5 కోట్ల మహిళలు రుతుస్రావ వయస్సులో ఉన్నారని, వీరిలో 75 శాతం మహిళలు నేటికీ అపరిశుభ్ర గుడ్డలను పీరియడ్స్ సమయంలో ఉపయోగిస్తున్నారని తెలుస్తున్నది. భారత్‌లో సహితం బహిష్టు సమస్య ఒక కళంకంగా భావించబడుతున్నది. రుతుస్రావ సమస్యలను తీసుకొని పురుషాధిక్య సమాజం మహిళాలోకాన్ని అబలుగా ముద్ర వేయడంతో లింగ వివక్ష మరింత పెరుగుతున్నట్లు తోస్తున్నది. నేటికీ భారతీయ మహిళలకు పీరియడ్స్ సమయ సెలవుల అవసరం గూర్చి సీరియస్‌గా చర్చించడం కూడా జరగడం లేదు. 1912లోనే కేరళ రాష్ట్రంలోని ఒక పాఠశాల విద్యార్థినులకు బహిష్టు సెలవులు మంజూరు చేయడం జరిగినప్పటికీ మెనుస్ట్రువల్ బెనిఫిట్స్ బిల్ ద్వారా రెండు రోజుల సెలవు మంజూరు చేయాలనే చట్టం తీసుకురావడంలో భారత ప్రభుత్వం నేటికీ సఫలం కాలేదు. 1992 నుంచి బీహార్ 2024 సాధారణ ఎన్నికల్లో తమిళనాడు డిఎంకే పార్టీ రుతుస్రావ సెలవుల సమస్యను కేంద్రం దృష్టి తెస్తామని తమ మానిఫెస్టోలో పొందుపరచడం చూస్తున్నాం. 2017, 2021ల్లో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన రుతుస్రావ సెలవుల ప్రైవేట్ బిల్లులు చర్చలకు మాత్రమే పరిమితం అయ్యింది. డిసెంబరు 2023 వరకు ఇలాంటి బిల్ తీసుకురావడానికి ప్రభుత్వం వెనుకడుగు వేసింది. నేటి 2025 సాధారణ ఎన్నికల మానిఫెస్టోల్లో భాజపా 'సంకల్ప పత్ర్'లోగాని, కాంగ్రెస్ 'న్యాయ పత్ర్'లోగాని మహిళల బహిష్టు సెలవుల ప్రత్యేక ప్రస్తావణలు లేకపోవడం చూస్తున్నాం. బహిష్టు సమయంలో వృత్తి ఉద్యోగాల్లో ఏకాగ్రత కొరవడడం, ఆ సమస్య పట్ల బహిరంగంగా మాట్లాడడం, కార్యాలయాల్లో మహిళలకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయడం కనీస అవసరంగా భావించాలి.

# బిలియనీర్ల భారత్...!



బ్రిటిష్ రాజ్యాధికారాన్ని పారదోలి ప్రజాస్వామ్య దేశంగా భారత్ అవతరించాలని ఆనాడు కోరుకున్న కలలన్నీ చెదిరిపోతున్నాయి. దేశంలో డెమోక్రసీ ప్లూటోక్రసీగా మారింది. దేశ పాలనలో అవినీతిపరులు కోటీశ్వరులుగా.. మహా కోటీశ్వరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అవినీతి విశృంఖలమై.. నేర చరిత్ర కలవారు మన పాలకులయ్యి దేశం అల్లాడిపోతుంది. ప్రజల ఆదాయాలు జాతీయ ఆదాయంలో వారి వాటా క్రమంగా తగ్గిపోతున్నది. దేశ ఆర్థిక అభివృద్ధి తిరోగమనంలో ఉన్నప్పటికీ కార్పొరేట్ వర్గాలకు చెందిన పై స్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుంది. వీరి సంపదలోని పెరుగుదల ఏ విధమైన ఉత్పత్తి క్రమం నుంచి వచ్చింది కాదు. దేశ సహజ వనరులను దేశ సంపదను ప్రభుత్వమే కార్పొరేట్లకు తాయిలాలుగా ఇస్తోంది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థ చేతుల్లో దేశంలోని పోర్టులలో 25 శాతం, సిమెంట్ ఉత్పత్తులలో 45 శాతం, స్టీల్ పరిశ్రమంలో 33 శాతం, టెలికాంలో 60 శాతం, బొగ్గు ఎగుమతుల్లో 45 శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, దేశం సంపద ప్రైవేట్ గుత్త సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచారు. మరి సంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? ఒక పక్క ద్రవ్యలోటు పేరుతో ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరో పక్క బడా బాబులు బ్యాంకులకు బకాయి పడ్డ లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో బ్యాంకులకు బకాయిలు పడిన పెద్దలు 14.56 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేసి కేవలం 15 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. మూడేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు 12కి కుదించారు. 2021-22 లో ఎఫ్‌డీఐ రూపేనా 4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే.. 2022-23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి 3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా దెబ్బతిస్తున్నాయో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల పతనం చూస్తే తెలుస్తుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్న ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల కోసం ఎగబడుతూ చేయని పనిలేదు. 1944లో బాంబే ప్లాన్ ప్రకారం.. స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ సహాయంతో పరిశ్రమ నెలకొల్పి పారిశ్రామికీకరణ జరపాలని నిర్ణయించారు. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో సామ్యవాద తరహా సమాజాన్ని స్థాపించాలని.. మన పాలకులు భారత రాజ్యాంగాన్ని రాసుకుని ప్రభుత్వమే అనేక సంస్థలను స్థాపించి సంక్షేమ రాజ్యం బాట పట్టించింది. కానీ నేడు విదేశీ పెట్టుబడులతో స్టాక్ మార్కెట్లో నిధులు కలిసి దేశాన్ని బిలినీయర్ల రాజ్యంగా మారుస్తున్నారు. స్వదేశీ విదేశీ పెట్టుబడి వర్గాల ప్రయోజనాల రక్షణకు భారీగా సబ్సిడీలు కల్పించి ప్రజా బహుళ ప్రయోజనాలు దెబ్బతీస్తున్నారు.

1991లో ఆర్థిక మంత్రి హోదాలో ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ బ్యాంకులో 8 ఏళ్ల పాటు పనిచేసిన అనుభవంతో యూపీఏ ప్రభుత్వ హయాంలో లైసెన్సులపై ఆంక్షలను ఎత్తివేసి గుత్త సంస్థల నిరోధక చట్టాన్ని నామరూపాలు లేకుండా చేశారు. దేశీయ ఆర్థిక వ్యవస్థ తాళాలను, తాళం చెవులతో సహా విదేశీ గుత్త సంస్థలకు వీరి నీడలో ఎదుగదలుచుకున్న స్వదేశీ పారిశ్రామిక గుత్త సంస్థలకు పాలకులు అప్పగించారు. మేము మీ కన్నా గొప్ప దేశభక్తులమని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని బిలీనియర్ల రాజ్యంగా మారుస్తున్నది . ప్రస్తుతం దేశంలో 200 మంది బిలియన్లు ఉన్నారు.. అమెరికా చైనా తర్వాత ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశం మనదే. ప్రభుత్వం ప్రజల నుండి గడిస్తున్న ఆదాయం ఎవరి ప్రయోజనాల కోసం కార్పొరేట్ రంగానికి సబ్సిడీలు ఇచ్చేందుకేనా? ఉచితంగా భూములు కేటాయింపు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు చౌకరేట్లకు సహజ వనరుల అమ్మకాలు ఇవన్నీ ఎవరి కోసం? ఇక ప్రభుత్వాలు ఎందుకు? ప్రభుత్వ స్థానాన్ని ప్రైవేటు కార్పొరేట్ రంగం మెల్లగా అనుభవిస్తున్నది. రాజ్యాంగాన్ని రాసుకున్నది సర్వ సమానత్వాన్ని కోరుకునేది ఇందుకేనా? మార్చి 2024 లో వరల్డ్ ఇన్ క్వాలిటీ ల్యాబ్ అనే గ్లోబల్ పరిశోధన సంస్థ వారు భారత్ బిలినీయర్ల రాజ్యం వైపుగా పరుగులు తీస్తున్నదని తెలియజేసినారు. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్లు రాజ్యాంగ భారత్ పరిణామం చెందుతున్నదని తెలిపారు. మన దేశంలో ఉన్నత ఆదాయ వర్గం వారు ఒకే ఒక శాతం ఉన్నప్పటికీ దేశంలోని జాతీయ ఆదాయంలో 22.6% పొందగలుగుతున్నారు. ఇంకా చెప్పాలంటే 0.1 శాతం ధనికులు మన దేశ జాతీయ ఆదాయంలో పది శాతం చేజిక్కించుకుంటున్నారు. ఇది ప్రపంచ దేశాల్లోనే ఎక్కువ.

## సెల్‌ఫోన్ బడిపిల్లలను నాశనం చేస్తుందా....!



దూరం ఉన్నవాళ్లు మాట్లాడుకోవడానికి పుట్టిన మొబైల్ ఫోన్ ఇప్పుడు బహుళ ప్రయోజనకారి అయిపోయింది. సెల్‌ఫోన్ ఇప్పుడు ఒక బ్యాంక్, ఒక కెమరా, ఒక పోస్టాఫీస్, సినిమా తెర, ఒక పాటల పెట్టి, ఒక రెడియో, ఒక టీవీ, మరోక సోషల్ మీడియా ప్లాట్‌ఫాం, ఇలా ఒకటేమిటి ఇందులో లేనిది ఏమి లేదు. ఇది లేకుండా ఎవరికైనా ఒక్క నిమిషం కూడా ఎల్లని స్థితి అన్ని వర్గాల వారికి దాపురించింది. అన్ని పనులు అందులోనే ఉండేవరకు సెల్ రహితంగా జీవించలేని స్థితి వచ్చింది. దీంతో ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ.. మరెన్నో నష్టాలు ఉన్నాయి. పెద్దవాళ్లకు సరేసరి బడిపిల్లలను ఫోన్ వెంటాడుతుంది. ఐదు పది పదిహేను ఏండ్ల పిల్లలకు ఫోన్ చూడటం అలవాటై వదిలి ఉండటం లేదు. ఎండాకాలం సెలవుల్లో ఇతర సమయాల్లో ప్రతి అబ్బాయి లేదా అమ్మాయి సెల్‌ఫోన్ తీసుకుని అందులో గేమ్స్ అడుతున్నారు. బీటీఎస్, బ్లాక్ పిక్ మ్యూజిక్ బాండ్ ఆల్బమ్స్ చూస్తున్నారు. కొందరు ఇన్ స్టాలో రీల్స్ చేస్తున్నారు. పిల్లలకు కొరియాకు చెందిన మ్యూజిక్ గ్రూప్ క్రియేట్ ఉన్నది. ఇట్లా తల్లి దగ్గర తండ్రి దొరుకుతే తన దగ్గర లేదా అమ్మమ్మ తాతల దగ్గర స్మార్ట్ ఫోన్ మెల్లిగా తీసుకని దూరం కూచొని గంటలకు గంటలు ఫోన్‌లో ఈ ఆటలు ఆడుతున్నరు. వద్దని నివారిస్తే ఎవరూ వినడం లేదు. పైగా పెద్దల మీదనే మర్లపడుతున్నారు. ఇదొక మ్యానియా అయింది. నిజానికి ఈ తరం పిల్లలు మైదానంలో క్రీడల్లో పాల్గొనాల్సి ఉంది. లేదా కళాసాహిత్య రంగాల్లో రాణించాల్సి ఉంది. కానీ ఏడ చూసిన ఎవరిఇళ్లు చూసినా పిల్లలు సెల్‌ఫోన్‌లో తలపెట్టి పైకి తీస్తలేరు. ఇదంతా కరోనా కాలం తర్వాత ఆన్‌లైన్ క్లాస్‌ల ద్వారా పిల్లలకు అబ్బిన జబ్బు. పిల్లల మెడలు వంచి గంటలకు గంటలు చూసి చూసీ మెడ వెనకు ఉబ్బెత్తుగా అయి నొప్పులు లేస్తున్నాయి.

# చిన్న దేశానికి అతి పెద్ద విపత్తు....



దక్షిణ పసిఫిక్ ప్రాంతంలోని చిన్న దేశమైన పపువా న్యూ గినియా నేడు అతిపెద్ద విపత్తులోచిక్కుకుంది. రెండు రోజుల క్రితం భారీగా కొండచరియలు విరిగిపడడంతో 670 మందికిపైగా అభాగ్యులు సజీవ సమాధి అయిపోయారు. ఐక్యరాజ్య సమతికి చెందిన వలసవాసుల సహాయ పునరావాస సంస్థ చీఫ్ సెర్హాన్ అక్టో ప్రాక్ ఆదివారం ఈ విషయం వెల్లడించారు. ఎన్గా ప్రావిన్స్‌లోని యంబల్లి, కొవోకలం గ్రామాలకు చెందిన వందలాది ఇళ్లు విరిగిపడ్డ కొండచరియల కింద పూర్తిగా కప్పబడిపోయాయని అయన తెలిపారు. సమాధి అయినవారంతా యుద్ధాలు, ఘర్షణల్లో నిరాశ్రయులై శరణార్థులుగా ఈ ప్రాంతానికి వచ్చిన వారే. దాదాపు నాలుగు వేల మంది ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఎనిమిది మీటర్ల ఎత్తున మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో ప్రాణ నష్టం అంచనాలకు అందడం లేదు. తొలుత 60 ఇళ్లు సమాధి అయ్యాయని అంచనా వేశారు. ఆ ప్రకారం 150 మంది చనిపోయినట్లు అధికారులు అంచనా వేశారు.. కానీ, క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే సమాధి అయిన ఇళ్ల సంఖ్య, అలాగే మృతుల సంఖ్య అనేక రెట్లు పెరిగిపోయాయి. 'ప్రస్తుతం 670 మందికి పైగా జనం శిథిలాల కింద సమాధి అయినట్లు అక్టోప్రాక్ మీడియాకు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి కేవలం ఆరుగురు మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. ఇప్పటికీ రాళ్లు పై నుంచి దొర్లుతూనే ఉన్నాయి. 200 కి.మీ పొదవునా రోడ్డు కప్పబడడంతో సహాయక చర్యలు చేపట్టడం కష్టమవుతోందని అక్టో ప్రాక్ చెప్పారు. పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్బీకి 600 కిలోమీటర్ల దూరంలోని ఎన్గా ప్రావిన్స్‌లో స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో వారంతా నిద్రలోనే మృత్యువు ఒడిలోకి జారుకున్నారు.

## ఢిల్లీ ఆసుపత్రిలో మంటలు



**న్యూఢిల్లీ :** శనివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో గేమింగ్ జోన్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం నుంచి దేశం తేరుకోక ముందే మరో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్ ఏరియాలోని బేబీ కేర్ న్యూ బోర్న్ ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఈ ఘటనలో ఏడుగురు పసికందులు అగ్నికి ఆహుతయ్యారు. మరో ఐదుగురు చిన్నారులు కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరుగురు పసికందులు అక్కడికక్కడే చనిపోగా, మరో నవజాత శిశవు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. హృదయవిదారకమైన ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఈ ప్రమాదానికి ఆక్సిజన్ సిలిండర్ పేలుడే కారణమని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి..దర్యాప్తులో కానీ, అసలు విషయం తేలదని పోలీసులు పేర్కొన్నారు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలియగానే 16 అగ్నిమాపక శకటాలతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే యత్నం చేశాయి. ఆసుపత్రిలో ఒక వార్డు నుంచి మరొక వార్డుకు మంటలు దావానలంలా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది అతి కష్టం మీద 12 మంది చిన్నారులను కాపాడారు దీనిపై కేసు నమోదు చేసి ఆసుపత్రి యజమాని డాక్టర్ నవీన్ కిచ్చిని పోలీసులు అరెస్టు చేశారు. అతను ఢిల్లీలో మరికొన్ని ఆసుపత్రులను కూడా నడుపుతున్నాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. గాయపడిన శిశువులకు వేరే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొందరి పరిస్థితి అందోళన కరంగా ఉన్నట్లు సమాచారం. మృత దేహాలను పోస్టుమార్టర నిమిత్తం జిటిబి ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. 'అమాయక శిశువులను కోల్పోయిన తల్లిదండ్రులకు అండగా ఉంటాం. ఈ నిర్లక్ష్యానికి కారణమైన వారెవర్నీ విడిచిపెట్టం' అని కేజ్రీవాల్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతు న్నట్లు చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ కూడా ఈ ఘటనపై సోషల్ మీడియాలో స్పందించారు.

## మతసామరస్యం చాటిన ముస్లింలు...!



**చెన్నై :** తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా పడియూర్ సమీపంలోని ఒట్టపాలయాంలో ముస్లింలు మతసామరస్యాన్ని చాటారు. స్థానికంగా హిందువులు వినాయకుడి మందిరం నిర్మించేందుకు సరైన స్థలం దొరకక ఇబ్బందులు పడుతున్న సంగతిని గమనించిన జమాత్ మసీదు నిర్వాహకులు మూడు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేసి ప్రశంసలు పొందారు. ఆరు లక్షల రూపాయల విలువ చేసే ఈ స్థలాన్ని ఆర్ఎంజి రోజ్‌గార్డెన్ ముస్లిం జమాత్ మసీదుకు చెందిన ప్రతినిధులు మందిర నిర్వాహకులకు ఉచితంగా అప్పగించారు. హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంలో జమాత్ కృషిని స్థానికులు ప్రశంసించారు. జమాత్ ప్రతినిధులకు పూలమాలలు వేసి, భాజాభజంత్రీలతో ఘనంగా సత్కరించారు. భిన్నత్వంలో ఏకత్వమనే భారత విశిష్ట లక్షణానికి ఇది నిఖార్సైన ఉదాహరణ అని స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంలో జమాత్ కృషిని స్థానికులు ప్రశంసించారు. జమాత్ ప్రతినిధులకు పూలమాలలు వేసి, భాజాభజంత్రీలతో ఘనంగా సత్కరించారు.

## ఆగని ఇజ్రాయిల్ దాడులు...!



రఫా: అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ దళాలు రఫాతో సహా గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతున్నాయి. తాజా దాడుల్లో మరో 30 మంది పాలస్తీనీయులు చనిపోయారు. ఒక వైపు హమాస్‌పై యుద్ధం పేరుతో ఇజ్రాయిల్ యథేచ్ఛగా మారణ కాండను కొనసాగిస్తుండగా, వచ్చేవారం ఇరు పక్షాలమధ్య చర్చలు తిరిగి ప్రారంభించేందుకు మధ్యవర్తులు యత్నిస్తున్నారు. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్, అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఎ అధిపతి, ఖతార్ ప్రధానితో జరిపిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఖతార్, ఈజిప్టు, అమెరికా ప్రమేయంతో కొన్ని కొత్త ప్రతిపాదనలను చర్చకు పెడతాయని ఈ వర్గాలు తెలిపాయి. చర్చల పునరుద్ధరణ పై హమాస్ ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించి ఇంతకు ముందు కైరోలో జరిగిన చర్చల్లో మధ్యవర్తులు సూచించిన ముసాయిదా ఒప్పందానికి హమాస్ అంగీకరించినా, ఇజ్రాయిల్ మొండిగా తిరస్కరించింది. అంతర్జాతీయ న్యాయస్థానం గాజాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని ఆదేశించడం, అంతర్జాతీయ నేర విచారణ కోర్టు (ఐసిసి) చీఫ్ ప్రాసిక్యూటర్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్న నెతన్యాహుకు అరెస్టు వారెంట్ జారీ చేయాలని కోరడం వంటి పరిణామాలతో ఇజ్రాయిల్, దానికి అతిపెద్ద మద్దతుదారుగా ఉన్న అమెరికా అంతర్జాతీయంగా మరింత ఒంటరిపాటుకు గురయ్యాయి.

## మరో 7 రోజులు బెయిల్ పొడిగించండి



**న్యూఢిల్లీ :** ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి మరో 7 రోజులు బెయిల్‌ను పొడిగించాలని ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. కేజ్రీవాల్ తన తీవ్ర ఆరోగ్య సమస్యలను వివరిస్తూ .. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బెయిల్ మంజూరు చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరడంతో జూన్ 1 వరకు సుప్రీం కేజ్రీవాల్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. జూన్ 2 న తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది. ఢిల్లీలోని మ్యాక్స్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కేజ్రీవాల్ కు ప్రాథమిక పరీక్షలు పూర్తయ్యాయని, మరి కొన్ని వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని వైద్య బృందం తెలిపింది. సిఎం ఆరోగ్యానికి కీలకమైన వైద్య పరీక్షలు పూర్తి చేసేందుకు మరో ఏడు రోజులు బెయిల్ పొడిగించాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది సుప్రీం కోర్టును అభ్యర్థించారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి విదితమే.

## పపువా న్యూగినియాలో ఘోర విపత్తు....!



**న్యూయార్క్ :** పపువా న్యూగినియా ఘోర విపత్తులో సజీవ సమాధి అయిన వారి సంఖ్య భారీగా పెరిగి వేలకు చేరింది. ఈ విషయాన్ని అక్కడి ప్రభుత్వం ఐరాసకు వెల్లడించింది. " కొండచరియలు విరిగి పడిన ఘటనలో 2000 మంది ప్రజలు సజీవ సమాధి అయ్యారు" అని ఆ దేశంలోని నేషనల్ డిజాస్టర్ సెంటర్ నుంచి ఐరాస కార్యాలయానికి సోమవారం ఉదయం లేఖ ద్వారా సమాచారం వెళ్లింది. దాదాపు 200 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ ఘోర విపత్తు జరిగింది. కొన్ని చోట్ల 8 మీటర్ల ఎత్తున శిథిలాలు కుప్పలు పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ చాలా చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి.

## నాసిక్‌లో ఉద్రిక్తత ఎఐఎంఐఎం నేత అబ్దుల్ పై కాల్పులు...!



**నాసిక్ (మహారాష్ట్ర) :** మాలేగావ్ మాజీ మేయర్, ఎఐఎంఐఎం నేత అబ్దుల్ మాలిక్ మహమ్మద్ యూనిస్‌పై సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. దీంతో నగరంలో ఉద్రిక్తత నెలకొంది. నాసిక్ పోలీసుల వివరాల మేరకు %ా% నగరంలో వేసవి ఉక్కపోతకు స్థానికులు అర్ధరాత్రి కూడా మెలకువగానే ఉండటం ఇక్కడ పరిపాటి. మహారాష్ట్ర ఎంఐఎం శాఖలో అబ్దుల్ ప్రముఖ నాయకుడుగా ఉన్నారు. ఈరోజు తెల్లవారుజామున ఒంటిగంట 20 నిముషాల సమయంలో ఓల్డ్ ఆగ్ర రోడ్డులోని ఒక రెస్టారెంట్ ఎదుట అబ్దుల్ కూర్చొని ఉండగా దుండగులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మూడు తూటాలు అబ్దుల్‌ను తాకాయి.

## బిలియనీర్ల భారత్..!

బ్రిటిష్ రాజ్యాధికారాన్ని పారదోలి ప్రజాస్వామ్య దేశంగా భారత్ అవతరించాలని ఆనాడు కోరుకున్న కలలన్నీ చెదిరిపోతున్నాయి. దేశంలో డెమోక్రసీ ప్లూటోక్రసీగా మారింది.దేశ పాలనలో అవినీతిపరులు కోటీశ్వరులుగా.. మహా కోటీశ్వరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అవినీతి విశృంఖలమై.. నేర చరిత్ర కలవారు మన పాలకులయ్యి దేశం అల్లాడిపోతుంది. ప్రజల ఆదాయాలు జాతీయ ఆదాయంలో వారి వాటా క్రమంగా తగ్గిపోతున్నది. దేశ ఆర్థిక అభివృద్ధి తిరోగమనంలో ఉన్నప్పటికీ కార్పొరేట్ వర్గాలకు చెందిన పై స్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుంది. వీరి సంపదలోని పెరుగుదల ఏ విధమైన ఉత్పత్తి క్రమం నుంచి వచ్చింది కాదు. దేశ సహజ వనరులను దేశ సంపదను ప్రభుత్వమే కార్పొరేట్లకు తాయిలాలుగా ఇస్తోంది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థ చేతుల్లో దేశంలోని పోర్టులలో 25 శాతం, సిమెంట్ ఉత్పత్తులలో 45 శాతం, స్టీల్ పరిశ్రమంలో 33 శాతం, టెలికాంలో 60 శాతం, బొగ్గు ఎగుమతుల్లో 45 శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, దేశం సంపద ప్రైవేట్ గుత్త సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచారు. మరి సంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? ఒక పక్క ద్రవ్యలోటు పేరుతో ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరో పక్క బడా బాబులు బ్యాంకులకు బకాయి పడ్డ లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో బ్యాంకులకు బకాయిలు పడిన పెద్దలు 14.56 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేసి కేవలం 15 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. మూడేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు 12కి కుదించారు. 2021-22 లో ఎఫ్‌డీఐ రూపేనా 4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే.. 2022-23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి 3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా దెబ్బతిస్తున్నాయో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల పతనం చూస్తే తెలుస్తుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్న ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల కోసం ఎగబడుతూ చేయని పనిలేదు. 1944లో బాంబే ప్లాన్ ప్రకారం.. స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ సహాయంతో పరిశ్రమ నెలకొల్పి పారిశ్రామికీకరణ జరపాలని నిర్ణయించారు. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో సామ్యవాద తరహా సమాజాన్ని స్థాపించాలని.. మన పాలకులు భారత రాజ్యాంగాన్ని రాసుకుని ప్రభుత్వమే అనేక సంస్థలను స్థాపించి సంక్షేమ రాజ్యం బాట పట్టించింది. కానీ నేడు విదేశీ పెట్టుబడులతో స్టాక్ మార్కెట్లో నిధులు కలిసి దేశాన్ని బిలినీయర్ల రాజ్యంగా మారుస్తున్నారు. స్వదేశీ విదేశీ పెట్టుబడి వర్గాల ప్రయోజనాల రక్షణకు భారీగా సబ్సిడీలు కల్పించి ప్రజా బహుళ ప్రయోజనాలు దెబ్బతీస్తున్నారు. 1991లో ఆర్థిక మంత్రి హోదాలో ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ బ్యాంకులో 8 ఏళ్ల పాటు పనిచేసిన అనుభవంతో యూపీఏ ప్రభుత్వ హయాంలో లైసెన్సులపై ఆంక్షలను ఎత్తివేసి గుత్త సంస్థల నిరోధక చట్టాన్ని నామరూపాలు లేకుండా చేశారు. దేశీయ ఆర్థిక వ్యవస్థ తాళాలను, తాళం చెవులతో సహా విదేశీ గుత్త సంస్థలకు వీరి నీడలో ఎదుగదలుచుకున్న స్వదేశీ పారిశ్రామిక గుత్త సంస్థలకు పాలకులు అప్పగించారు. మేము మీ కన్నా గొప్ప దేశభక్తులమని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని బిలీనియర్ల రాజ్యంగా మారుస్తున్నది . ప్రస్తుతం దేశంలో 200 మంది బిలియన్లు ఉన్నారు.. అమెరికా చైనా తర్వాత ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశం మనదే. ప్రభుత్వం ప్రజల నుండి గడిస్తున్న ఆదాయం ఎవరి ప్రయోజనాల కోసం కార్పొరేట్ రంగానికి సబ్సిడీలు ఇచ్చేందుకేనా? ఉచితంగా భూములు కేటాయింపు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు చౌకరేట్లకు సహజ వనరుల అమ్మకాలు ఇవన్నీ ఎవరి కోసం? ఇక ప్రభుత్వాలు ఎందుకు? ప్రభుత్వ స్థానాన్ని ప్రైవేటు కార్పొరేట్ రంగం మెల్లగా అనుభవిస్తున్నది. రాజ్యాంగాన్ని రాసుకున్నది సర్వ సమానత్వాన్ని కోరుకునేది ఇందుకేనా? మార్చి 2024 లో వరల్డ్ ఇన్ క్వాలిటీ ల్యాబ్ అనే గ్లోబల్ పరిశోధన సంస్థ వారు భారత్ బిలినీయర్ల రాజ్యం వైపుగా పరుగులు తీస్తున్నదని తెలియజేసినారు. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్ల రాజ్యాంగ భారత్ పరిణామం చెందుతున్నదని తెలిపారు. మన దేశంలో ఉన్నత ఆదాయ వర్గం వారు ఒకే ఒక శాతం ఉన్నప్పటికీ దేశంలోని జాతీయ ఆదాయంలో 22.6% పొందగలుగుతున్నారు. ఇంకా చెప్పాలంటే 0.1 శాతం ధనికులు మన దేశ జాతీయ ఆదాయంలో పది శాతం చేజిక్కించుకుంటున్నారు. ఇది ప్రపంచ దేశాల్లోనే ఎక్కువ. ఇంకా సంపద విషయానికొస్తే 2022-23 లో ఒక శాతం ధనికుల దగ్గర 40.1 శాతం సంపద ఉన్నది. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం ద్వారా 1990ల నుంచి ఈ ఆదాయ సంపద అసమానతలు గణనీయంగా పెరిగిపోయాయి. 1990 మధ్యకాలంలో ఇద్దరే ఇద్దరు ఉన్న మన బిలినీయర్లో ప్రస్తుతం 200 మందికి చేరారు. ఆనాడు ఆ ఇద్దరు బిలినీయర్ల ఆస్తుల విలువ 3.2 బిలియన్ డాలర్లు మాత్రమే. నేడు ఉన్న 200 బిలినీయర్ల ఆస్తుల విలువ 954 బిలియన్ డాలర్లు. ఈ విధంగా దేశ సంపద కొంతమంది చేతుల్లోకి పోవడం వలన ఆదాయ అసమానతలు పెరిగి మానవాభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ఒకవైపు కాంగ్రెస్ పార్టీ న్యాయ ప్రత్ అనే మేనిఫెస్టో ద్వారా, మరొకవైపు బీజేపీ సంకల్ప ప్రత్ అనే మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఏ మేరకు ఉచితాలతో నోరూరిస్తూ అధికారంలోకి ఎలా రావాలి అని తాపత్రయ పడుతున్నారే తప్ప ఆశేష పేద ప్రజానీకానికి సౌకర్యాలను వారి ఆర్థిక అభివృద్ధి తద్వారా సంక్షేమాన్ని ఆలోచిస్తున్నారా? అనే అనుమానం రాకపోదు.

# షుగర్ ఉన్నవారు.. చెరుకు రసం తాగొచ్చా.....!

ఎండాకాలం వచ్చిందంటే చాలు అందరికీ తిప్పలు మొదలవుతూ ఉంటాయి. ఎందుకంటే ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు ఎంతో మంది ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇక మండే ఎండలకు ఇంటి నుంచి కాలు బయటపెట్టాలంటేనే భయపడిపోతూ ఉంటారు. కానీ ఏం చేస్తాం తప్పని పరిస్థితుల్లో ఉద్యోగమో.. లేదంటే ఇతర పనులను మీద బయటకు వెళ్లాల్సిందే. దీంతో ఎండాకాలంలో బయటికి వెళ్ళినప్పుడు ఉపశమనం కోసం ఏదో ఒకటి తాగడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇలా ఎండాకాలం లో ఎక్కడికి వెళ్తున్నా అందుబాటులో ఉండే పానీయం ఏదైనా ఉంది అంటే అది చెరుకు రసం అని చెప్పాలి. రోడ్డు వెంట వెళ్తుంటే ప్రతిచోట ఇలా చెరుకు రసం బండ్లు కనిపిస్తూ ఉంటాయి. ఈ క్రమం లోనే ఇలా ఎండ వేడిని తట్టుకునేందుకు కాస్త ఉపశమనాన్ని పొందేందుకు ఎంతో మంది చెరుకు రసం తాగడం లాంటివి చేస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. అయితే కొంతమంది మాత్రం చెరుకు రసం తాగడానికి భయపడిపోతూ ఉంటారు. వాళ్లే ఇక మధుమేహంతో బాధపడుతున్న వారు. సాధారణంగా చెరుకు రసంలో తీపి ఎక్కువగా ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే అటు షుగర్ తో బాధ పడుతున్న వారు చెరుకు రసం తాగొచ్చా లేదా అని ఎప్పుడూ అనుమాన పడుతూ ఉంటారు. ఈ అనుమానం తోనే కొన్నిసార్లు తాగకుండా సైలెంట్ గానే ఉండి పోతారు. అయితే మధుమేహం ఉన్నవారు చెరుకు రసం తాగొచ్చా అంటే అసలు వద్దంటున్నారు వైద్య నిపుణులు. ఇవి జ్యూస్ తాగినప్పుడు మధుమేహం లేని వారిలో కూడా షుగర్ లెవెల్స్ స్వల్పంగా పెరిగినట్లు అధ్యయనం లో తేలింది అంటూ చెబుతున్నారు. చెరుకు రసంతో పలు ఉపయోగాలు ఉన్నప్పటికీ డయాబెటిస్తో బాధపడుతున్న వారు మాత్రం దానికి దూరంగా ఉండటమే మంచిది అని సూచిస్తున్నారు. సాధారణంగా చెరుకు రసంలో తీపి ఎక్కువగా ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే అటు షుగర్ తో బాధ పడుతున్న వారు చెరుకు రసం తాగొచ్చా లేదా అని ఎప్పుడూ అనుమాన పడుతూ ఉంటారు. ఈ అనుమానం తోనే కొన్నిసార్లు తాగకుండా సైలెంట్ గానే ఉండి పోతారు.



## ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీళ్లు తాగడం మంచిది..!



ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం చాలా ముఖ్యం. ఈ ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీళ్ల తాగడం. ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ ప్రక్రియ మెరుగుపడుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మురికి సులభంగా తొలగిపోతుంది. ఇది మాత్రమే కాదు, ఇతర వ్యక్తులతో పోలిస్తే ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగే వారిలో కిడ్నీ, రాళ్ల సమస్యలు తక్కువగా కనిపిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, మనం ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగాలి. అయితే ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీళ్లు తాగడం వల్ల ప్రయోజనం ఉంటుందనే ప్రశ్న తరచుగా చాలామంది ప్రజల మదిలో మెదులుతుంది. చాలామంది ఉదయం నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి చెబుతుంటారు. అయితే ఇప్పుడు మనం ప్రతిరోజు ఉదయాన్నే ఎన్ని గ్లాసుల నీళ్లు తాగాలో తెలుసుకుందాం. మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే మొదట చేయవలసిన పని మీ పళ్ళు తోముకోవడం, మీకు టీ తాగే అలవాటు ఉంటే, దానికి బదులుగా నీరు తాగటం అలవాటు చేసుకోండి. ఉదయం నిద్ర లేవగానే కనీసం 2-3 గ్లాసుల నీళ్లు తాగాలి. మీరు ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగలేకపోతే, ఒక గ్లాసు నీటితో ప్రారంభించండి. క్రమంగా కొన్ని రోజుల్లో 2 - 3 గ్లాసుల నీళ్లు తాగడం ప్రారంభించండి. మీరు ఉదయాన్నే తాగు నీటిని గోరువెచ్చగా చేయండి. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా రోగనిరోధక శక్తిని కూడా బలపరుస్తుంది.

## నిద్ర పట్టకపోతే కంటి ఆరోగ్యం షెడ్డుకే..?



మనం సరిగ్గా నిద్రపోతున్నారో లేదో ముందుగా చెక్ చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కంటి ఆరోగ్యానికి సరైన నిద్ర అవసరం. మనం రోజంతా ఎన్ని పనులు చేసినా, ఎంత బిజీగా ఉన్నా రాత్రిపూట బాగా నిద్రపోవాలి. తగినంత నిద్ర లేనప్పుడు శరీరంలో అనేక రకాల సమస్యలు వస్తాయి. నిద్ర మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. నిద్ర కంటి ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని చాలా మందికి తెలియదు. శరీరంలోని మిగిలిన భాగాల మాదిరిగానే, కళ్ళకు విశ్రాంతి మరియు పునరుజ్జీవనానికి సమయం కావాలి. నిద్రపోతున్నప్పుడు కళ్లు తాజాగా ఉంటాయి. ఇది మంచి దృష్టి మరియు కంటి పనితీరులో సహాయపడుతుంది. ఈ రాత్రి ప్రక్రియలో రోజంతా పేరుకుపోయిన దుమ్ము, అలెర్జీ కారకాలు మరియు చికాకులను బయటకు పంపడానికి కళ్లను లూబ్రికేట్ చేయడం ఉంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కంటి సమస్యలు వస్తాయి. వాటిలో ఒకటి డ్రై ఐ సిండ్రోమ్. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కళ్లు హైడ్రేట్‌గా ఉండే అవకాశాలు తగ్గుతాయి. ఇది చికాకు, కళ్ళు ఎర్రబడటం, పొడిబారడం వంటి బాధించే సమస్యలను కలిగిస్తాయి. వీటితో పాటు దృష్టి లోపం కూడా రావచ్చు. నిద్ర లేకపోవడం వల్ల తలెత్తే మరో సమస్య ఫ్లాపీ ఐలిడ్ సిండ్రోమ్.

## మడమల పగుళ్లకు కొబ్బరి నూనె....




పాదాలను శరీరానికి పునాదిగా పరిగణిస్తారు. మొత్తం శరీరం బరువు పాదాలపైనే ఉంటుంది. మన శరీరాన్ని కదిలించేది పాదాలు. అందుకే పాదాల సంరక్షణ చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో మడమల పగుళ్ల సమస్య సాధారణం. మహిళలు ఎక్కువగా ఈ సమ్యతో బాధపడతారు. తేమ లేకపోవడం, విటమిన్ లోపం, మధుమేహం, థైరాయిడ్, ఊబకాయం, 60 ఏళ్లు పైబడిన వారు మడమల పగుళ్ల సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. మీరు కూడా పగిలిన మడమల సమస్యతో పోరాడుతూ ఉంటే, అది జన్యుపరమైన లేదా ఆరోగ్య కారణాల వల్ల కావచ్చు. దీనికి కారణం, నివారణ మార్గాలను ఇక్కడ తెలుసుకుందాం.. పాదాల పట్ల అజాగ్రత్తగా ఉండటం వల్ల సాధారణంగా మడమల పగుళ్ల సమస్య పెరుగుతుంది. చెప్పులు లేదా ఓపెన్ షూలను ఉపయోగించడం వల్ల కూడా మడమల పగుళ్లు ఏర్పడతాయి. చాలా సార్లు పాదాల మడమలలో లోతైన పగుళ్ల కారణంగా భరించలేని నొప్పిని ఎదుర్కోవలసి ఉంటుంది. మీ పాదాల చర్మం తరచుగా పొడిగా మారుతుంది. పొడిబారినప్పుడు, అది మడమల పగుళ్లకు కారణం అవుతుంది. శరీరంలో తేమ లేకపోవడం వల్ల, సజీవ కణాలు గట్టిపడతాయి. మడమల ప్రాంతంలో చనిపోయిన కణాలు పెరుగుతాయి. మీ చర్మానికి యవ్వనాన్ని, తాజాదనాన్ని తీసుకురావడానికి, వారానికి ఒకసారి మీ పాదాలకు ఇంట్లోనే పెడిక్యూర్ చేసుకోండి. గోరువెచ్చని నీటిలో పాదాలను ముంచడం వల్ల మడమల చర్మం మృదువుగా మారుతుంది. మృతకణాలను తొలగించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ మీ పాదాలు, మడమల సరైన సంరక్షణ కోసం ప్రతిరోజూ స్నానానికి ముందు మీ పాదాలను స్వచ్ఛమైన బాదం నూనెతో మసాజ్ చేయండి. స్నానం చేసిన తర్వాత, పాదాలు తడిగా ఉన్నప్పుడే క్రీమ్ అప్లై చేయండి. ఇది పాదాలపై తేమను నిలుపుదల చేస్తుంది. ఫుట్ క్రీమ్‌తో మీ పాదాలను సర్క్యులర్ మోషన్‌లో తేలికగా మసాజ్ చేయండి. ఇది మీ పాదాలను మృదువుగా ఉంచుతుంది. మడమల పగుళ్ల సమస్యను నివారిస్తుంది. పాదాల సమస్యలకు తేనె సహజ నివారణగా పనిచేస్తుంది. తేనెలో యాంటీ బాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి పగిలిన మడమలను శుభ్రం చేస్తాయి. పగిలిన మడమలకు సహజంగా చికిత్స చేస్తాయి. పగిలిన మడమల కోసం సహజ చికిత్స మీ వంటగదిలో కూడా అందుబాటులో ఉంది. నిమ్మకాయను కోసి అందులో సగం తీసుకుని అందులో పంచదార కలిపి మడమల మీద మెత్తగా రుద్ది తర్వాత శుభ్రమైన మంచినీటితో మడమలను కడగాలి. వారానికి రెండుసార్లు ఈ ప్రక్రియను అనుసరించడం వల్ల మంచి సానుకూల ఫలితాలు వస్తాయి. మడమల పగుళ్లకు కొబ్బరి నూనె దివ్యౌషధంలా పనిచేస్తుంది.

## జుట్టు సమస్యలతో విసుగెత్తిపోతున్నారా..?




మండుతున్న ఎండల నుండి ఉపశమనం పొందాలనుకునే మనందరికీ సబ్జా నీరు చక్కటి పరిష్కారం.. ఈ సబ్జా గింజలను నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. రోజూ ఉదయాన్నే సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తాగడం అలవాటు చేసుకుంటే జుట్టు సమస్యలన్నీ తొలగిపోతాయి.. నల్లని జుట్టును పొందవచ్చు. వికారంగా, వాంతి వచ్చే విధంగా ఉంటే సబ్జా గింజల పానీయం తాగడం ఉత్తమం. గొంతు మంట, దగ్గు, ఆస్తమా, తలనొప్పి, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. ఈ మధ్యకాలంలో అందరినీ వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం.. ఈ సమస్య ఉన్నవారు రోజూ ఉదయాన్నే సబ్జా వాటర్ తాగడం అలవాటు చేసుకుంటే ఖచ్చితంగా జుట్టును రూట్ నుంచి దృఢపరుస్తుంది. ఈ నివారణకు ఈరోజు ఒక చెంచా సబ్జా గింజలను ఒక గ్లాసు నీటిలో వేసి కనీసం 30 నిమిషాలు నాననివ్వండి, ఆపై ఆ నీటిలో ఒక చెంచా నెయ్యి మరియు సగం నిమ్మరసం వేసి తాగాలి. ఈ తరహా డ్రింక్ ను రెగ్యులర్ గా తాగడం వల్ల జుట్టు సమస్యలే కాకుండా గుండెల్లో మంట, అజీర్ణం వంటి ఆరోగ్య సమస్యలను కూడా తగ్గించుకోవచ్చు. పోషక విలువలున్న సబ్జా గింజలు కాస్త గట్టిగానే ఉంటాయి..కానీ ఈ గింజల్లో పీచు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి..ప్రత్యేకంగా ఇవి బరువు తగ్గడంలో సహాయపడతాయి. ఈ సబ్జా గింజల పానీయం కేవలం చలవ చేయడం మాత్రమే కాదు మన ఒంటికి ఎంతో మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తుంది.

## రోజూ కివి తింటే ఎన్ని ప్రయోజనాలో...!



ప్రజలు తమ డైట్ లో కచ్చితంగా పండ్లను చేర్చుకోవాలని వైద్యనిపుణులు చెబుతుంటారు. పండ్లను తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతారు. నిజానికి, పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే పండ్లలో కూడా కొన్ని పండ్లను పోషకాల నిధిగా చెబుతారు. ఈ పండ్లలో ఒకటి కివి. ఇది రుచిలో తియ్యగా, పుల్లగా ఉంటుంది. అందుకే చాలామంది దీన్ని ఎక్కువగా ఇష్టపడతారు. అయితే తియ్యగా, పుల్లగా ఉంటే ఈ కివీ అనేక తీవ్రమైన వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే ఈ రోజూ కివి పండును ఎంత మోతాదులో తినాలి, దాని ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. కివితో కలిగే ప్రయోజనాలు.. కివిలో పొటాషియం, ఫైబర్, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఇ, పాలీఫెనాల్స్ పుష్కలంగా లభిస్తాయి. అలాగే కివిలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఈ పండు అమృతం లాంటిది. అంతే కాదు అనేక వ్యాధులను నివారించడంలో ఈ పండు సంజీవనిలా పనిచేస్తుంది.

## మూత్రం పసుపు రంగులో వస్తే.....?



మానవ శరీరంలో చాలా ముఖ్యమైన అవయవాలలో కిడ్నీలు కూడా ఒకటీ.ఇది మన శరీరంలోని రక్తం నుండి మురికిని అదనపు ద్రవాలను సైతం ఫిల్టర్ చేయడానికి ఉపయోగపడుతుంది.అలాగే రక్తపోటు ఎర్ర రక్త కణాలను నియంత్రించే హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తుంది. అందుకే మన శరీరంలో చాలా ముఖ్యమైనవిగా చెబుతూ ఉంటారు. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ఆకలి లేకపోవడం, పాదాలు వాయడం, దురద చర్మం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తక్కువ మూత్ర విసర్జన వంటి లక్షణాలు ఉంటాయి అలాగే పసుపు మూత్రం కూడా వచ్చినట్టుగా అనిపిస్తుంది. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలి అంటే మనం డైట్ లో మూత్రపిండాలను శుభ్రపరిచే ఆహారాలను సైతం తీసుకోవలసి ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు కూడా మెరుగుపడుతుంది. దీనివల్ల మన శరీరంలో ఉండే విష పదార్థాలు కూడా బయటకి రావడానికి సహాయపడుతుంది. అలాంటి వాటిలో కూరగాయలు మూత్రపిండాలలోని విషయాన్ని సైతం తొలగించడానికి చాలా ఉపయోగపడుతుంది. ఫైబర్ పుష్కలంగా ఉండేటువంటి వాటిని తినడం వల్ల మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడతాయట. ముఖ్యంగా క్యాబేజీ ,కాలీఫ్లవర్, బ్రోకలీ వంటి వాటిని తినాలి.స్ట్రాబెర్రీ ,బ్లూబెర్రీ ఇతరత్రా బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మూత్రపిండాలు ఆరోగ్యానికి సహాయపడతాయి. అలాగే కిడ్నీ కణజాలానికి హాని కలిగించే ఆక్సీకరన నుంచీ బయటపడేలా చేస్తుంది. ఆకుకూరలలో బచ్చలాకుకూర, మెంతికూర ఇతరత్రా ఆకుకూరలలో విటమిన్లు ఖనిజాలు చాలా పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి.

# మౌని రాయ్ బాలి నుండి తన అద్భుతమైన బ్లూ బీచ్ లుక్స్‌తో "స్పామ్ అవర్ ఫీడ్స్"



బ్లాన్ సాధారణంగా ఎప్పటిలాగే లౌకికంగా ఉంటుంది కానీ మీరు మౌని రాయ్‌గా ఉన్నప్పుడు కాదు. బాలీవుడ్ నటి తన తాజా చిత్రాలతో ఆ భావనను తలకిందులు చేస్తోంది. మౌని ప్రస్తుతం బాలిలో సెలవు తీసుకుంటున్నారు మరియు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమె అనుభవిస్తున్న సోమవారం బ్లూస్‌ను మాకు రుచి చూపించారు. ఫోటోల శ్రేణిలో, శ్రీమతి రాయ్ దాని ఛాయలతో పోటీపడే దుస్తులలో బాలి యొక్క నీలి జలాలకు వ్యతిరేకంగా పోజులిచ్చింది. ఆమె నీలిరంగు బికినీని ఎంచుకుంది, దానికి సరిపోయే హాల్టర్ నెక్ టాప్‌తో దిగువన సైడ్ కట్‌అవుట్ వివరాలు ఉన్నాయి. దాని మీద, ఆమె ఒక జత ముదురు సన్ గ్లాసెస్‌ని జోడించేటప్పుడు మరియు ఆమె జుట్టును బన్‌లో లాగి పెద్ద పరిమాణంలో అమర్చిన నీలిరంగు క్రాప్ టాప్‌ను లేయర్‌గా వేసుకుంది. ఆమె దానికి క్యాప్షన్ ఇచ్చింది, "మీ ఫీడ్‌లను స్పామ్ చేసినందుకు క్షమించండి!!!!! గ్రాండ్ & ట్రాజిక్!" క్షమాపణ చెప్పవద్దు మౌని, ఎందుకంటే మీ పెద్ద బీచ్ శక్తిని మేము పొందలేము. బాలి నుండి మరిన్ని ఫోటోలలో, మౌని మరో సంతోషకరమైన బీచ్ లుక్‌లో "జలపాతాలను వెంబడిస్తున్నట్లు" గుర్తించబడింది. అలాగే కొలను దగ్గర ఒక రోజు గడిపి, ఆమె ఆకుపచ్చ మరియు తెలుపు ప్రింటెడ్ బికినీ టాప్ మరియు మ్యాచింగ్ బాటమ్‌లను ధరించింది, ఆమె లేత నీలం రంగు డెనిమ్ కటాఫ్‌లతో కప్పబడి ఉంది. ప్రసిద్ధ బాలి స్వింగ్ మరియు హార్ట్ సీటర్‌లో గడిపిన ఒక రోజు కోసం, ఆమె మండుతున్న ఎరుపు రంగు మ్యాక్సీ దుస్తులను ఎంచుకుంది.






## కాస్టింగ్ కౌచ్‌కు...

# బలవుతుంది వాళ్లే....



తెలుగు రాష్ట్రాల నుంచి ఈ మధ్య కాలంలో ఎంతో మంది అమ్మాయిలు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. అందులో కొందరు మాత్రమే డేరింగ్ అండ్ డాషింగ్‌గా ఉంటూ హైలైట్ అయ్యారు. అలాంటి వారిలో గాయత్రి గుప్తా ఒకరు. సినిమాల్లో పద్దతిగా కనిపించినా.. ఈ అమ్మడు బయట మాత్రం బోల్డుగా ఉంటూ హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా కాస్టింగ్ కౌచ్ గురించి మొట్టమొదట లేవనెత్తి సెన్సేషన్ అయింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న గాయత్రి గుప్తా.. మరోసారి కాస్టింగ్ కౌచ్ గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. 'గతంలో నేను చేసిన పోరాటానికి అంతగా సహకారం అందలేదు. తర్వాత మరికొందరు నాలా పోరాడడం వల్లే ఇండస్ట్రీ స్పందించింది. ఇందుకోసం ఓ కమిటీని కూడా వేశారు. ఇప్పుడు చాలా మంది బాధితులకు అది ఒక ఫ్లాట్‌ఫాం అయింది' అంటూ చెప్పుకొచ్చింది. కాస్టింగ్ కౌచ్‌పై కామెంట్స్:ఇదే ఇంటర్వ్యూలో గాయత్రి గుప్తా కంటిన్యూ చేస్తూ.. 'ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ ఉందన్న విషయం నేను ఎప్పటి నుంచో చెబుతున్నాను. అయితే, చాలా మంది హీరోయిన్లు ఇష్టంతోనే శృంగారం వంటివి చేస్తున్నారు. కొందరు మాత్రం అవసరాల కోసం చేస్తున్నారు. వీళ్లలో అమాయకపు అమ్మాయిలే ఎక్కువగా బలి అవుతున్నారు' అని వివరించింది.



# బెంగళూరును దాటేస్తున్న హైదరాబాద్.......



చాలా మందికి లవబుల్ సిటీ. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి విద్యార్థి చదవు అయిపోగానే పరుగెత్తేది హైదరాబాద్ వైపే. ఎందుకంటే అక్కడ అవకాశాలు దొరకుతాయి.. ట్రైనింగ్ సెంటర్లు ఉంటాయి.. ఏదో ఒకరకంగా సెటిల్ కావచ్చన్న అంచనాతో అందరూ హైదరాబాద్ వైపు చూస్తుంటారు. అయితే ఇటీవల ఓ సర్వేలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఐటీ జాబ్స్ అంటే మొదట గుర్తొచ్చేది బెంగళూరే. అక్కడ ఉద్యోగం చేసేందుకు ఐటీ ప్రొఫెషనల్స్ కూడా ఇష్టపడతారు. అయితే ఇటీవల ఐటీ ఉద్యోగుల ఆలోచనా విధానం మారుతోంది. చాలా మంది బెంగళూరు కన్నా హైదరాబాద్ లోనే ఉద్యోగం చేస్తామని చెబుతున్నారంట. హైదరాబాద్ తర్వాత బెంగళూరును ఇష్టపడుతున్నారట. దేశంలో ఓవరాల్ గా ఐటీ జాబ్స్ తగ్గినప్పటికీ ఈ రెండు నగరాల్లో జాబ్స్ కొదువేలేదని గ్లోబల్ జాబ్ మ్యాచింగ్ అండ్ హైరింగ్ ప్లాట్ ఫారం 'ఇన్‌డీడ్' ప్రకటించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. గ్లోబల్ జాబ్ మ్యాచింగ్ అండ్ హైరింగ్ ప్లాట్‌ఫారమ్ ఇన్‌డీడ్ ఏప్రిల్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఉద్యోగాల స్థితిని హైలైట్ చేస్తూ కొత్త డేటాను విడుదల చేసింది. ఈ డేటా ప్రకారం, ఐటీ రంగంలో ఉద్యోగ నియామకాలు హైదరాబాద్‌లో 41.5%, బెంగళూరులో 24% పెరిగాయి. ఈ నగరాలు ఐటీ ప్రొఫెషనల్స్ ఇష్టపడుతున్న అగ్ర గమ్యస్థానాలుగా పేర్కొంది. ఆసక్తికరంగా, జాబ్ క్లిక్‌లలో కూడా గణనీయమైన పెరుగుదల ఉంది, హైదరాబాద్‌లో ఉద్యోగార్థుల ఆసక్తి 161% పెరిగింది. బెంగళూరులో 80% పెరిగింది. దేశం మొత్తం మీద చూస్తే.. ఐటీ ఉద్యోగ అవకాశాలు తగ్గాయి. జాబ్ పోస్టింగ్‌లు 3.6% తగ్గాయి. ల అనిశ్చిత ప్రపంచ ఆర్థిక వాతావరణం కారణంగా టెక్ కంపెనీలు నియామకంలో జాగ్రత్తగా ఉన్నాయని ఇది సూచిస్తుంది. ఇన్‌డీడ్ ఇండియా సేల్స్ హెడ్ శశి కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ అండ్ ఐటీ పొజిషన్‌లను ప్రస్తుతం ఈ రంగంలో పనిచేస్తున్న వారికే కాకుండా కొత్త కెరీర్ అవకాశాల కోసం వెతుకుతున్న వ్యక్తులు కూడా ఎక్కువగా కోరుతున్నారు. లేఆఫ్‌లు ఉన్నప్పటికీ, ఐటీ ఉద్యోగాల ఆకర్షణ పెరిగింది. ఈ పాత్రలకు సాధారణంగా అవసరమైన విస్తృతమైన నైపుణ్యం, శిక్షణ, అనుభవం కారణంగా ఐటీలో ఈ బలమైన ఆసక్తి ఉంటోంది.

# ఒక్క ఆలోచనతో రూ.15780 కోట్ల బిజినెస్....



చదువు పూర్తయిన తరువాత ఏదో ఒక ఉద్యోగం చేయాలనుకునే వారు చాలామంది ఉన్నారు. అయితే బిజినెస్ చేసి ఎదగాలని చాలా తక్కువ మందికి మాత్రమే ఉంటుంది. అలాంటి కోవకు చెందిన వారిలో ఒకరు 'ప్రతీక్ సూరి'. ఇంతకీ ఈయన ఎవరు? ఈయన చేస్తున్న బిజినెస్ ఏంటి? వ్యాపారంలో ఎలా సక్సెస్ సాధించారు అనే మరిన్ని వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఢిల్లీకి చెందిన ప్రతీక్ సూరి తన పాఠశాల విద్యను బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పూర్తి చేశారు. ఆ తరువాత 2006లో అతను దుబాయ్‌లోని బిట్స్ పిలానీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదవడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి వెళ్లాడు. దుబాయ్‌లో చదువుకునే రోజుల్లోనే.. సుమారు 200 విభిన్న దేశాలకు చెందిన వ్యక్తులతో కూడిన యుఏఈ జనాభాలోని అపారమైన వైవిధ్యం అతనిని ఎంతగానో ఆకర్షించింది. ఆ సమయంలోనే గ్లోబల్ కమ్యూనిటీలో లీనమవ్వడం కావలసిన అపరిమితమైన అవకాశాల గురించి కూడా తెలుసుకున్నారు. చదువు పూర్తయిన తరువాత.. సొంతంగా బిజినెస్ స్టార్ట్ చేయాలని ఆలోచించి.. అనుకున్న విధంగానే 2012 ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను ఉత్పత్తి చేసే 'మాసర్' (%మీుంవతీ%) సంస్థను స్థాపించారు. ఈ సంస్థ అతి తక్కువ కాలంలోనే ఆఫ్రికన్ మార్కెట్‌లో కూడా విస్తరించింది.

# ఓటీటీ ప్రియులకు జియో 50శాతం ఆఫర్...




ఓటీటీ ప్రియులకు జియో టెలికాం సర్వీస్ ప్రొవైడర్ శుభవార్త చెప్పింది. ఓ సరికొత్త ప్రీమియం వార్షిక సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. గతంలో రూ.999 ధరతో అందించిన వార్షిక ప్లాన్ మాదిరి ప్రయోజనాలు ఈ సరికొత్త ప్లాన్‌లో కూడా అందించనుంది. ఇప్పుడు తీసుకొచ్చిన కొత్తప్లాన్ ద్వారా ఎలాంటి ప్రకటనలు లేకుండా 4కే రిజల్యూషన్‌తో స్ట్రీమింగ్ వీడియోను ఆస్వాదించొచ్చు. వాస్తవానికి ఈ ప్లాన్ వార్షికధర రూ.599. అయితే ప్రారంభ ఆఫర్ కింద దీనిని రూ.299కే అందిస్తున్నారు. అంటే 50శాతం డిస్కౌంట్ ఆఫర్ లభిస్తోంది. మొదటి 12నెలల బిల్లింగ్ సైకిల్ ముగిశాక సబ్‌స్క్రిప్షన్ కావాలంటే పూర్తి మొత్తంలో రీచార్జి చేయాల్సి ఉంటుంది. ఏడాది పొడవునా ఒక డివైజ్‌లో ఎలాంటి వాణిజ్య ప్రకటనలు లేకుండా కంటెంట్‌ను వీక్షించొచ్చు. డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లోనూ కంటెంట్‌ను ఆస్వాదించొచ్చు. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్, ఇతర క్రీడలు, ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలు మాత్రం ప్రకటనలతోనే వస్తాయి. ఇటీవల జియో రూ.29, రూ.89తో (ఫ్యామిలీ ప్యాక్) రెండు కొత్త ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను తీసుకొచ్చింది. ఇవి నెలవారీ ప్లాన్లు. సినిమాలు, హాలీవుడ్ బ్లాక్‌బస్టర్లు, పిల్లల షోలు, టీవీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను స్మార్ట్ టీవీసహా ఏ డివైజ్‌లోనైనా వీక్షించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తీసుకొచ్చిన వార్షిక ప్లాన్‌లోనూ ఈ తరహా సదుపాయాలే ఉన్నాయి. జియో గత నెలలో ప్రీమియం ఫ్యామిలీ సబ్‌స్క్రిప్షన్ చార్జీలను రూ.149 నుంచి రూ89కి తగ్గించింది. ఈ ప్లాన్‌లో ఒకేసారి నాలుగు డివైజ్‌లలో కంటెంట్‌ను వీక్షించొచ్చు.

# 'డివిడెండు' లాభాలు కొనసాగొచ్చు




ఈ వారం సూచీలు రాణించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి రికార్డు స్థాయిలో డివిడెండు అందనుండడంతో వచ్చిన సానుకూల వాతావరణానికి తోడు విదేశీ మదుపర్లు త్వరలోనే కొనుగోళ్లు మొదలు పెడతారన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. నిఫ్టీ-50 జీవనకాల తాజా గరిష్ఠాలకు చేరినందున కొంత అప్రమత్తత కూడా ఉండొచ్చంటున్నారు. శనివారం వెలువడిన దివీస్ ఫలితాలు, ఈ వారం వెల్లడయ్యే టాటా స్టీల్ (బుధ), అపోలో హాస్పిటల్స్ (గురు) ఫలితాలను గమనించాలి. డెరివేటివ్ కాంట్రాక్టుల గడుబు గురువారం ముగియనున్నందున, ఒడుదొడుకులకు అవకాశం ఉంది. మార్చి త్రైమాసిక, 2023-24 జీడీపీ గణాంకాలు శుక్రవారం వెలువడనున్నాయి. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాకే, విదేశీ పెట్టుబడులపై స్పష్టత వస్తుందనీ భావిస్తున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..సానుకూల దేశీయ, అంతర్జాతీయ సంకేతాల మధ్య లోహ తయారీ సంస్థల షేర్లు రాణించొచ్చు. ఈ రంగ షేర్లను తగ్గినపుడల్లా కొనుగోలు చేయడం మంచిదని ఓ బ్రోకరేజీ చెబుతోంది. సార్వత్రిక ఎన్నికలు చివరి దశకు చేరినా, పెద్దగా వార్తలేమీ లేకపోవడంతో సిమెంటు రంగ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. వాహన కంపెనీల షేర్లు సానుకూలతను కొనసాగించొచ్చు. బలమైన ఆర్థిక ఫలితాలకు తోడు 2024-25లో విక్రయాలపై సానుకూల అంచనాలు ఇందుకు దోహదం చేయొచ్చు. ఐటీ కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే ట్రేడవవచ్చు. చాలా వరకు షేర్లు తమ మద్దతు స్థాయిలకు సమీపంలో ఉన్నందున, తక్కువ స్థాయిల నుంచి పుంజుకోవచ్చు. బలహీన సంకేతాల మధ్య ఔషధ రంగ షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. నిఫ్టీ ఫార్మా సూచీ 19,400 నిరోధ స్థాయిని అధిగమిస్తేనే ర్యాలీకి అవకాశం ఉంది. రుతుపవనాల ప్రవేశం, కేంద్ర బడ్జెట్‌పై స్పష్టత వచ్చే వరకు ఎఫ్ఎమ్‌సీజీ రంగ కంపెనీల షేర్లు ఒక శ్రేణికే పరిమితం కావొచ్చు. చాలా వరకు యంత్రపరికరాల కంపెనీలు బలమైన ఫలితాలను ప్రకటించడంతో ఈ రంగ షేర్లు లాభాలను కొనసాగించొచ్చు. ఎన్నికల ఫలితాల ముందు ప్రభుత్వ రంగ చమురు కంపెనీల షేర్లు రాణించొచ్చు. కేంద్రం మూలధన వ్యయాలు అధికంగా చేయొచ్చన్న అంచనాలు ఇందుకు దోహదం చేయొచ్చు. టెలికాంలో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా షేర్లు ఈ వారం రాణించొచ్చు. అయితే రూ.1850కి తిరిగి రాకపోవచ్చు. నిఫ్టీ బ్యాంక్ సూచీపై విశ్లేషకులు 'బులిష్'గా ఉన్నారు. ముఖ్యంగా ఆర్‌బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండును కేంద్రానికి బదిలీ చేయడానికి సిద్ధం కావడం సానుకూలతలను తెచ్చిపెట్టింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లను పరిశీలించొచ్చు.

# ఆరు ప్రాజెక్టులపై రెరా కొరడా.....!




రేరా నిబంధనలు ఉల్లంఘించిన పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఆరు కంపెనీలు రేరా అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించారు. మియాపూర్ ప్రజ్ఞ ఎకోస్పెన్, చింతల్‌కుంట శ్రీ సిద్ధి వినాయక ప్రాపర్టీ డెవలపర్స్, కొండాపూర్ నార్త్ ఈస్ట్ హెబిటీషన్స్, సంగారెడ్డి జిల్లా వి.ఆర్. ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్, కెపిహెచ్‌బీ కాలనీ ఇన్వెస్టు ఇన్ ఫ్రా ప్రొజెక్టు, కొంపల్లి భారతి లేక్యూ టవర్ బిల్డర్స్ రేరా నిబంధనలు ఉల్లంఘించినందున 15 రోజుల లోగా సంజాయిషి సమర్పించాలని ఆదేశిస్తూ పోకాజు నోటీసులు జారీ చేసినట్టు రెరా అథారిటి పేర్కొంది. రియల్ ఎస్టేట్ కంపెనీలకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, యుడీఏ, టీజీఐఐసీ, ఇతర స్థానిక సంస్థల అనుమతులతో పాటు రెరా రిజిస్ట్రేషన్ ఉంటేనే కొనుగోలుదారులకు భద్రత, భరోసా చేకూరుతుందని రేరె తెలిపింది. ఇల్లు, ఫ్లాట్ కొనాలి అనుకునే వారు రేరా రిజిష్టర్డు ప్రాజెక్టులలో మాత్రమే కొనుగోలు చేయాలని రెరా అథారిటి కొనుగోలు దారులకు సూచించింది. ఫ్రీలాంచ్ ఆఫర్లను నమ్మి రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో కొని మోసపోరాదని రెరా అథారిటి విజ్ఞప్తి చేసింది. రేరా రిజిస్ట్రేషన్ పొందకుండా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, టీజీఐఐసీ, ఇతర స్థానిక సంస్థల అనుమతులు లేకుండా వ్యాపార ప్రకటనలు జారిచేయడం, మార్కెటింగ్‌కు పాల్పడటం రేరా చట్ట రీత్యా నేరమని అథారిటి స్పష్టం చేసింది. కొనుగోలు చేసే ముందు ఆయా ప్రాజెక్టులు, కంపెనీల నేపథ్యం తెలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. రేరా అనుమతి పొందినవి, ఆయా ప్రాజెక్టుల పూర్తి వివరాలు, ప్రమోటర్ పేరు, చిరునామా, ఇతర అన్ని వివరాలు రేరా వెబ్ సైటులో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. బాధ్యతగా పరిశీలించుకుని మోసాలకు గురికాకుండా కొనుగోలు చేసుకోవాలని రేరా స్పష్టం చేసింది.

# బంగారం ప్రియులకు షాక్..!



బంగారం ప్రియులకు షాకింగ్ న్యూస్. గత వారం రోజులుగా తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు.. నేడు భారీగా పెరిగాయి. సోమవారం (మే 27) బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,650గా ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,710 వద్ద కొనసాగుతోంది. ఈరోజు 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.250 పెరగ్గా.. 24 క్యారెట్లపై రూ.270 పెరిగింది. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో నేటి బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,800గా ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.66,650 కాగా.. 24 క్యారెట్ల ధర రూ.72,710గా నమోదైంది. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.67,200.. 24 క్యారెట్ల ధర రూ.73,310గా ఉంది. బెంగళూరు, కోల్‌కతా, కేరళ, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.66,650 కాగా.. 24 క్యారెట్ల ధర రూ.72,710గా నమోదైంది. నేడు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండిపై ఏకంగా రూ.1500 పెరిగి.. రూ.93,000గా ఉంది. ఈరోజు ఢిల్లీలో కిలో వెండి ధర రూ.93,000 కాగా.. ముంబైలో రూ.93,000గా ఉంది.

# వాణిజ్య భాగస్వామ్యాల్లో లోటే ఎక్కువ...!



మన దేశం నుంచి వివిధ దేశాలకు ఎగుమతులు, అక్కడి నుంచి దిగుమతులు జరుగుతుంటాయి. మన ఎగుమతుల బిల్లు కంటే, దిగుమతుల బిల్లు అధికంగా ఉంటే, మన దేశానికి వాణిజ్య లోటుగా పరిగణించాలి. అదే మన ఎగుమతులు అధికంగా ఉండి, దిగుమతులు తక్కువగా ఉంటే, మనకు వాణిజ్య మిగులు లభించినట్లు. మనదేశంతో వాణిజ్య లావాదేవీలు అధికంగా నెరపే 10 దేశాలతో చూసుకుంటే, తొమ్మిది దేశాలతో మన దేశానికి వాణిజ్య లోటు నమోదవుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో అమెరికా-భారత్ మధ్య 118.28 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం నమోదు కాగా, మనకు వాణిజ్య మిగులు 36.74 బిలియన్ డాలర్లుగా ఉండటం గమనార్హం. చైనా, రష్యా, సింగపూర్, కొరియా సహా 9 దేశాలతో మనకు వాణిజ్య లోటే నమోదైంది. 2022-23తో పోలిస్తే చైనా, రష్యా, కొరియా, హాంకాంగ్‌లతో మనకు వాణిజ్య లోటు పెరిగింది. యూఏఈ, సౌదీ అరేబియా, ఇండోనేషియా, ఇరాక్‌లతో వాణిజ్య లోటు తగ్గింది. ః 2023-24లో మన దేశానికి అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా కొనసాగింది.

గరుడ వార్త



# మోడీనీ 'పరమాత్మ పంపించాడట'!



దేవ్‌రియా (యుపి) : కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీపై మరొక సారి విరుచుకుపడ్డారు. పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీకి, ముఖేష్ అంబానీకి సాయం చేయడానికే ప్రధాని మోడీని ఆయన 'పరమాత్మ (భగవంతుడు)' పంపాడని రాహుల్ ఆక్షేపించారు. తనను 'భగవంతుడు పంపాడు' అని ప్రధాని మోడీ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యకు రాహుల్ అలా స్పందించారు. రాహుల్ గాంధీ యుపి దేవ్‌రియాలో ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, మోడీని భగవంతుడు రైతులు, కూలీలకు సేవ చేయడానికి పంపలేదని అన్నారు. 'ప్రతి ఒక్కరూ జీవసంబంధం ఉన్నవారు. కాని నరేంద్ర మోడీజీ జీవసంబంధం ఉన్నవారు కాదు. అంబానీ, అదానీలకు సాయం కోసం ఆయనను పరమాత్మ పంపాడు. కానీ పరమాత్మ ఆయనను రైతులు, కూలీలకు సాయం కోసం పంపలేదు' అని రాహుల్ గాంధీ అన్నారు. 'మోడీ వాలె పరమాత్మ' అని ప్రధాని మాట్లాడుతున్నారని రాహుల్ అన్నట్లు 'ఎఎన్ఐ' తెలిపింది. 'పరమాత్మ ఆయనను పంపినట్లయితే, ఆయన నిరుపేదలు, రైతులకు సాయం చేసి ఉండేవారు. యెహ్ కైసే పరమాత్మ హైఁ? యెహ్ నరేంద్ర మోడీజీ వాలె పరమాత్మ హైఁ. (ఈయన ఏ రకం భగవంతుడు? ఈయన పిఎం మోడీ భగవంతుడు)' అని రాహుల్ వ్యాఖ్యానించారు. తాను అగ్నిపథ్ పథకాన్ని చించివేసి చెత్తబుట్టలో పడవేస్తానని రాహుల్ ర్యాలీలో వాగ్దానం చేశారు. ఇండియా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్‌పై 50 శాతం పరిమితిని అంతం చేస్తుందని ఆయన చెప్పారు. ఇండియా కూటమి రాజ్యాంగాన్ని కాపాడుతుందని రాహుల్ స్పష్టం చేశారు.

# ఏపీలో 144 సెక్షన్....

## ఎన్నికల సంఘం కీలక నిర్ణయం



అమరావతి: ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఉత్కంఠ పెరిగిపోతోంది. అందరి సందేహాలు, పార్టీ అంచనాలు, గెలుపు లెక్కలు తేలే సమయం వచ్చేస్తోంది. ఎవరు గెలుస్తారు అనే ప్రశ్న ఓవైపు ప్రజలను, నేతలను గ్రిల్ చేస్తుంటే కౌంటింగ్ సజావుగా ఎలా జరపాలనే సందేహం అధికారులను వేధిస్తోంది. కాగా, రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి గందరగోలం, గొడవలు, ఎర్పడకుండా.. విధ్వంసాలు జరగకుండా రాష్ట్రంలో ఎన్నికల సంఘం పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈసారి కేంద్ర బలగాలను భారీగా మోహరిస్తున్నారు. కేంద్ర బలగాలు ఉన్న ప్రాంతంతోపాటు మిగతా ప్రాంతాలపై కూడా ఎన్నికల సంఘం నజర్ పెట్టింది. అందుకే లెక్కింపు రోజున ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 144 సెక్షన్ వధిస్తున్నట్టు ప్రకటించింది. ఆ రోజు ప్రజల రోజు వారి పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో జూన్ ఆరో తేదీ వరకు ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం ఉంది. అదే టైంలో బాణాసంచాపై కూడా ఆంక్షలు పెట్టారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కోసం 20కంపెనీల బలగాలను బందోబస్తు కోసం ఆంధ్రప్రదేశ్‌లోకి దింపుతోంది ఎన్నికల సంఘం. ఇప్పటికే ఘర్షణలతో హీటెక్కిన పల్నాడు, చంద్రగిరి, తాడిపత్రితో పాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ బలగాలను మోహరించబోతున్నారు. ఆయా ప్రాంతాల్లో అణువణువూ గాలించి అనుమానితలను అదుపులోకి తీసుకోనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఇక ప్రస్తుతం పోలీసు శాఖ, ఇతర అధికారులు, సిట్ బృందాల ఆధ్వర్యం చేపట్టిన చర్యలు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా తెలిపారు. పోలింగ్ తర్వాత కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు జరిగాయని కేంద్ర బలగాల రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ప్రశాంతంగా తిరుగుతున్నారని ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేదని వివరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యి... ఎన్నికల కోడ్ తొలగిపోయే వరకు ఇదే పరిస్థిత కొనసాగించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్టు మీనా వెల్లడించారు.

## మళ్లీ నితీష్ మనసు మారవచ్చేమో!...

# తేజస్వి యాదవ్ వ్యంగ్యాస్త్రాలు



పాట్నా: తన మాజీ బాస్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై ఆర్‌జెడి అధినేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మరోసారి రంగులు మార్చేందుకు ఆయన(నితీష్) సిద్ధపడతారని తేజస్వి వ్యాఖ్యానించారు. మంగళవారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ..జూన్ 4 తర్వాత తన పార్టీని కాపాడుకునేందుకు, వెనుకబడిన తరగతుల రాజకీయాలను రక్షించుకునేందుకు మా అంకుల్(నితీష్) దేనికైనా తెగిస్తారు. ఆయన ఎటువంటి పెద్ద నిర్ణయమైనా తీసుకుంటారు అని ఎద్దేవా చేశారు. గత దశాబ్ద కాలంలో నితీష్ కుమార్ ఐదుసార్లు కూటములను మార్చారు. చివరిసారి ఎన్‌డిఎతో చేతులు కలిపిన తర్వాత ఇదే చివరిదని కూడా ఆయన చెప్పారు. ఒకసారి బిజెపి కూటమితో, మరోసారి ప్రతిపక్ష కూటమితో ఇలా పలుసార్లు అటుఇటు జతకట్టిన నితీష్ కుమార్ గెలుపు గుర్రాల వైపే ఉండడం పలువురిని ఆశ్చర్యపరుస్తోంది. ఈ ప్రస్తుత లోక్‌సభ ఎన్ని షయాన్నే తేజస్వి తన వ్యాఖ్యల ద్వారా వ్యక్తం చేశారు. కాగా..ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్‌లో ఇండియా కూటమికి, ఎన్‌డిఎ కూటమికి మధ్య హోరాహోరీ పోరు జరుగుతోంది. గత సార్వత్రిక ఎన్నికలలో నితీష్ కుమార్‌కు చెందిన జెడియు, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్‌జనశక్తి పార్టీ ఎన్‌డిఎ కూటమిలోనే ఉండి బీహార్‌లోని 40 స్థానాలలో ఒకటి మినహాయించి మిగిలిన స్థానాలన్నిటినీ కైవసం చేసుకున్నాయి. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# మరో మహమ్మారిని ఎదుర్కోక తప్పదు..!


## హెచ్చరించిన బ్రిటన్ ప్రభుత్వ మాజీ సలహాదారు



కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తూనే ఉన్నది. కొత్త కొత్త రూపాలను మార్చుకుంటూ పంజా విసురుతున్నది. మొన్నటి వరకు శాంతించిన వైరస్ మళ్లీ జడలువిప్పుతున్నది. ఇటీవల సింగపూర్ సహా పలు దేశాల్లో కేసులు పెరగడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలోనే బ్రిటన్ ప్రభుత్వ మాజీ ప్రధాన సలహాదారు సర్ పాట్రిక్ వాలెన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరోనా తరహా మరో సంక్షోభాన్ని మానవాళి ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కరోనావైరస్ మహమ్మారి భయంకరమైన అనుభవాల నుంచి ప్రపంచం బయటపడిందని.. అదే తరహా సంక్షోభం ఎదుర్కోవడం 'ఖచ్చితంగా అనివార్యం' అన్నారు. ఈ దిశలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ప్రపంచదేశాలకు పిలుపునిచ్చారు. సంక్షోభం ఎదురైన సమయంలో తక్షణమే స్పందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. అవసరమైన స్థాయిలో వైద్య పరీక్షల నిర్వహణ సామర్థ్యం, టీకాలు, చికిత్సలు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని.. దాంతో లాక్‌డౌన్, సోషల్ డిస్టెన్స్ తదితర వంటి కఠిన చర్యలు అవసరం ఉండబోదన్నారు. 2021లో తాను చేసిన సూచలన్నీ 2023 నాటికి అనేక దేశాలు మరచిపోయాయన్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సైనిక అవసరాల విషయంలో ఎలా అప్రమత్తమై ఉంటామో.. సంక్షోభం కట్టడి చర్యలకు సైతం అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనన్నారు. యుద్ధంతో నిమిత్తం లేకుండా ఆర్మీ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లుగానే సంక్షోభ నివారణ వ్యవస్థలపై దృష్టి పెట్టాలని సూచించారు. సంక్షోభ సమయంలో వివిధ దేశాలు కలిసికట్టు చర్యలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ చొరవ తీసుకోవాలని పాట్రిక్ వాలెన్స్ పిలుపునిచ్చారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు..

# మిజోరాంలో 10 మంది మృతి



మిజోరాంలో భారీ వర్షాలు కురుస్తున్నయి. ఎడతెరిపి లేకుండా వడుతున్న వానలకు ఐజ్వాల్ శివార్లలో ఓ రాతి క్వారీ కుప్పకూలి 10 మంది మరణించారు. మరికొంతమంది శిథిలాల క్రింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వెంటనే పోలీసులతోపాటు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. ఐజ్వాల్ పట్టణం దక్షిణ శివార్లలోని మెల్తుమ్, హ్లిమెన్ మధ్య ప్రాంతంలో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో పలువురు తప్పిపోయినట్లు పోలీసులు తెలిపారు. వర్షం కురుస్తుండడంతో సహాయక చర్యలు నెమ్మదిగా కొనసాగుతున్నాయి.

ఈ ఘటనలో ప్రాణనష్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో రెమాల్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. తుపాను హెచ్చరికల దృష్ట్యా.. రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలకు రెడ్ అలర్ట్, ఉత్తర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. హంథర్ వద్ద జాతీయ రహదారి 6పై కొండచరియలు విరిగిపడటంతో ఐజ్వాల్ నుంచి ఇతర ప్రాంతాలకు రవాణమార్గాని అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఇక, నదుల నీటి మట్టాలు కూడా పెరుగుతున్నాయని.. నదీతీర ప్రాంతాల్లో నివసించే చాలా మంది ప్రజలను ఖాళీ చేయించినట్లు మిజోరాం డిజిపి వెల్లడించారు.

# వెయ్యి రూపాయల బిర్యానీ తిన్నందుకు..

# లక్ష రూపాయల ఆస్పత్రి బిల్లు కట్టాల్సి వచ్చింది!



**షాద్‌నగర్:** పెళ్లి రోజు కదా అని హోటల్‌కు వెళ్లి బిర్యాని తినడమే ఆ కుటుంబం చేసిన పాపమైంది. సరదాగా మండి బిర్యాని తింటే.. హోటల్‌లో సరైన నాణ్యత ప్రమాణాలు వాడకపోవడం వల్ల కాస్త ఫుడ్ పాయిజనింగ్‌కు దారి తీసింది. ఒకరి తర్వాత ఒకరు వాంతులు, విరోచనాలు చేసుకుని ఆస్పత్రిలో చేరేలా చేసింది. వాళ్లు తిన్నది వెయ్యి రూపాయల బిర్యానీ అయితే.. ఆస్పత్రిలో లక్ష రూపాయలు కట్టే పరిస్థితి తీసుకొచ్చింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. షాద్‌నగర్ మండలం అప్పరెడ్డిగూడ గ్రామంలో కావలి నరేందర్ నివసిస్తున్నాడు. ఈ నెల 22న తన పెళ్లి రోజు కావడంతో కుటుంబసభ్యులతో కలిసి షాద్‌నగర్‌లోని సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ అందరూ కలిసి మండి బిర్యాని తిన్నారు. కాసేపు అక్కడే సరదాగా గడిపి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటికి వెళ్లాక ఒకరి తర్వాత అస్వస్థతకు గురయ్యారు. అందరికీ వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో నరేందర్‌తో పాటు అతని భార్య మంగమ్మ, కుటుంబసభ్యులు దీక్షిత, తన్విక, అనిరుధ్, అభిలాష్, జ్యోత్స్న, సాయి శ్రీకర్ సహా మొత్తం ఎనిమిది మందిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారందరూ అక్కడే చికిత్స పొందుతున్నారు. వీరిలో రేందర్‌కు రక్తపు వాంతులు, విరేచనాలు కావడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. కాగా, వారికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు కలుషిత ఆహారం తినడం వల్లే అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. దీనిపై కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. వెయ్యి రూపాయలు ఖర్చు చేసి బిర్యాని తింటే.. ఆస్పత్రిలో లక్ష రూపాయల బిల్లు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కాకతీయ తోరణం రాచరిక పోకడనట..!

## రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ : ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ కళాతోరణం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలాగా మారింది అని కేటీఆర్ విమర్శించారు. ప్రముఖ కళాకారుడు అలె లక్ష్మణ్ తయారు చేసిన రాష్ట్ర రాజముద్రలో తెలంగాణ చరిత్రకి, సాంస్కృతిక వారసత్వానికి, గంగా-జమునా తెహజీబ్‌కి ప్రతీకలైన కాకతీయ తోరణం, చార్మినార్ ఉంటే అది రాచరిక పోకడనట అని కేటీఆర్ మండిపడ్డారు. కానీ రాష్ట్ర గీతంలో మాత్రం అదే చార్మినార్ గురించి "గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్" అని పాడుకోవాలి. "కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప" అని అదే రాచరిక పరిపాలన గురించి ప్రస్తుతించాలి. అసలు ముఖ్యమంత్రికి గాని, ఆయన మంత్రిమండలిలో ఒక్కరికైనా రాష్ట్రగీతంలో ఏమున్నదో తెలుసా..? అని కేటీఆర్ నిలదీశారు.

## ఐసీఐసీఐ, ఎస్ బ్యాంక్‌కు ఝులక్ ఇచ్చిన ఆర్బీఐ.. భారీ జరిమానా

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకులైన ఎస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొరడా ఝుళిపించింది. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలను పాటించడంలో విఫలమైన కారణంగా రెండు బ్యాంకులపై చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఐసీఐసీఐ బ్యాంక్ కు రూ.కోటి, ఎస్ బ్యాంక్ కు రూ.91 లక్షల భారీ జరిమానా విధించింది. మార్చి 31, 2022 నుంచి బ్యాంకు ఆర్థిక పరిస్థితులపై ఆర్‌బీఐ తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో ఆర్‌బీఐ మార్గదర్శకాలను పాటించడంలో ఐసీఐసీఐ బ్యాంక్ విఫలమైనట్లు తేలింది. ప్రాజెక్టు రిపోర్టులు, ఆర్థిక పరిస్థితులను పరిశీలించకుండానే పలు సంస్థలకు టర్మ్‌లోన్‌లు ఇచ్చినట్లు గుర్తించింది. ఈ మేరకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949లోని పలు నిబంధనల ప్రకారం ఐసీఐసీఐ బ్యాంకుపై చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్‌కు రూ.కోటి జరిమానా విధించింది. అదేవిధంగా.. కస్టమర్ సర్వీస్, అంతర్గత, కార్యాలయ ఖాతాలకు సంబంధించిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన కారణంగా ఎస్‌బ్యాంక్‌కు రూ.91 లక్షలు ఫైన్ వేసింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com